# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 10
శుక్రవారం, 27 డిసెంబర్, 2024
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## విషమంగా మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి




హైదరాబాద్, డిసెంబర్ 26 (ఆర్ఎన్ఎ): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మంద జగన్నాథం ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నది. రెండు రోజుల క్రితం గుండెపోటు రావడంతో ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు వెల్లడించారు. దీంతో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తోపాటు పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. 1996లో ఆయన తొలిసారిగా టీడీపీ తరపున నాగర్‌కర్నూల్ ఎంపీగా విజయం సాధించారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం టికెట్‌పై విజయం సాధించారు.

## భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని ఇకలేరు

- ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ఐదు దశాబ్దాలపాటు వివిధ హోదాల్లో దేశానికి సేవలు
- పీవీ నాయకత్వంలో భారత గతిని మార్చిన ఆర్థికవేత్త
- సరళీకృత విధానాలతో సంక్షోభాలను తప్పించిన ధీశాలి
- ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రం సాకారం
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖుల సంతాపం
- వారం రోజులు సంతాప దినాలుగా ప్రకటించిన కేంద్రం

*భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ (92) కన్నుమూశారు. గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. వృద్ధాప్యంతో బాధపడుతున్నా, వీల్‌చైర్‌కే పరిమితమైనా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారు. పీవీ నాయకత్వంలో నడిచి, ఆర్థిక సంస్కరణలకు బాటలు పరిచిన దార్శనికుడు మన్మోహన్. సరళీకృత ఆర్థిక విధానాలతో.. మౌనంగానే దేశగతిని మార్చారు. ఆరు దశాబ్దాలపాటు రాజకీయాల్లో అజాతశత్రువుగానే ఆయన కొనసాగారు. మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు.*



# మౌనలోకాలకు మన్మోహన్..

**న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్(92) కన్నుమూశారు. తీవ్ర అనారోగ్యంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం ఆయన తుదిశ్వాస విడిచారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన గురువారం రాత్రి స్పృహ కోల్పోవడంతో కుటుంబసభ్యులు దవాఖానకు తరలించారు. దాదాపు గంటన్నర పాటు ఆయనకు చికిత్స అందించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని, 9.51 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారని ఎయిమ్స్ ప్రకటించింది. మన్మోహన్ సింగ్ మృతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని పార్టీల నేతలు సంతాపం వ్యక్తం చేశారు. ఏడు రోజుల పాటు సంతాప దినాలుగా కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేసి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి ఒడ్డుకు తెచ్చిన ఘనత మన్మోహన్‌దే. సరళతర ఆర్థిక విధానాల రూపకర్తగా, దేశ ఆర్థికవ్యవస్థకు కొత్తదిశను చూపిన మార్గదర్శిగా ఆయన నిలిచారు.

### దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్త

1932 సెప్టెంబర్ 26న ప్రస్తుత పాకిస్థాన్‌లోని గాహ్ ప్రాంతంలో జన్మించారు. 1947లో దేశ విభజన జరిగినప్పుడు మన్మోహన్ సింగ్ కుటుంబం భారత్‌కు వచ్చి మొదట హల్ద్వానీలో, ఆ తర్వాత అమృత్‌సర్‌లో స్థిరపడింది. మన్మోహన్ చిన్న వయసులోనే ఆయన తల్లి మృతి చెందడంతో నానమ్మ దగ్గర పెరిగారు. పంజాబ్ వర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో 1952లో డిగ్రీ, 1954లో పీజీ పూర్తి చేశారు. 1957లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశారు. 1962లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ అందుకున్నారు. తర్వాత భారత్‌కు తిరిగొచ్చి తను చదివిన పంజాబ్ యూనివర్సిటీలోనే ఎకనమిక్స్ సీనియర్ లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పని చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లోనూ ఆయన కొంతకాలం ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖకు సలహాదారుగా వ్యవహరించారు. 1972 నుంచి 1976 వరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన ఆర్థిక సలహాదారుగా పని చేశారు. 1982 నుంచి 1985 వరకు రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1985 నుంచి 1987 వరకు ప్రణాళిక సంఘానికి డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరించారు. దేశం గర్వించదగ్గ ఆర్థికవేత్తగా ఆయన ఎదిగారు.

### రాజకీయాల్లోకి తీసుకొచ్చిన పీవీ

విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా మన్మోహన్ తనదైన ముద్ర వేశారు. ఆర్థిక రంగంలో ఆయన అనుభవం, జ్ఞానంతో ఎన్నో గొప్ప అవకాశాలు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. 1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు.. మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థికమంత్రిని చేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని గాడిన పెట్టే కీలక బాధ్యతను అప్పగించారు. ఈ సమయంలోనే దేశంలో ఆర్థిక సంస్కరణలకు, సరళతర విధానాలకు మన్మోహన్ సింగ్ శ్రీకారం చుట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు.

### ప్రధానిగా అనూహ్య అవకాశం

1991లో మొదటిసారి అస్సాం – మిగతా 2వ పేజీలో




## తెరమీదకు వీఆర్వో వ్యవస్థ

**హైదరాబాద్, డిసెంబర్ 26:** తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలో మళ్లీ మార్పులు రాబోతున్నాయి ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కొత్త విఆర్వో చట్టం అమల్లోకి రాబోతోంది ఇదిలా ఉంటే తిరిగి వీఆర్వో వీఆర్ఏ వ్యవస్థలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. వచ్చే ఏడాది నుంచి ఈ కొత్త మార్పులు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను 2020 సెప్టెంబర్ లో రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఫలితంగా 7039 వీఆర్వో పోస్టులు రద్దు అయ్యాయి.ప్రక్షాళనలో భాగంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం విఆర్వో వ్యవస్థను రద్దు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి గ్రామస్థాయిలో భూ వ్యవహారాలకు సంబంధించి ప్రత్యేకంగా అంటూ సిబ్బంది ఎవరూ లేరు. ప్రతిదీ తహసిల్దార్ కార్యాలయమే పర్యవేక్షిస్తూ వస్తోంది. విఆర్వోలు పెద్ద ఎత్తున లంచాలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల తారుమారుకు కూడా వీఆర్వో లే ప్రధాన బాధ్యులని గత బిఆర్ఎస్ ప్రభుత్వం భావించింది. రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన జరగాలంటే వీఆర్వో వ్యవస్థ ఉండరాదన్న – మిగతా 2వ పేజీలో



## నో బెనిఫిట్!

- ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు అనుమతించం
- నాకు ఎవరిపైనా ఇష్టాయిష్టాల్లేవ్
- సీఎంగా చట్టాన్ని అమలు చేస్తా సీఎం రేవంత్
- అసెంబ్లీలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నా..
- చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం.. పద్ధతిగా ఉండండి
- సీఎం పేరు చెప్పనందుకే కేసు అని ప్రచారం చేస్తారా?..
- ఎప్పుడో ఆ స్థాయి దాటాం.. మీరెందుకు ఖండించలే?
- పోలీసులను అడ్డుకుంటే వారితోపాటు సెలబ్రిటీలపైనా కేసులు..
- అభిమానులనూ మీరే నియంత్రించాలి
- సామాజిక బాధ్యతను సినీ పరిశ్రమ గుర్తుపెట్టుకోవాలి..
- డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రచారం చేయాలి
- పర్యావరణం, ఆలయ పర్యాటక ప్రచార బాధ్యతా మీదే..
- ఇండస్ట్రీ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం

**హైదరాబాద్, డిసెంబరు 26:** ఇకపై సినిమా బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. అసెంబ్లీలో ఈమేరకు తాను చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినీ పెద్దలకు తేల్చిచెప్పారు. అయితే.. చిత్ర పరిశ్రమకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని, పరిశ్రమ కూడా సామాజిక బాధ్యత నిర్వర్తించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ కేసు విషయాన్ని ప్రస్తావించిన సీఎం.. బన్నీ తన పేరును మర్చిపోవడం వల్ల కేసు పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేశారని, తాను ఆ స్థాయిని ఎప్పుడో దాటివచ్చేశానని పేర్కొన్నారు. 'ఆ తప్పుడు ప్రచారాన్ని మీరెందుకు

– మిగతా 2వ పేజీలో

**సినీపరిశ్రమ నుంచి సెస్ వసూలు యోచన: భట్టి**

## రూ.10వేల కోట్లు వచ్చినయ్!

- టీజీఐఐసీకి రుణం ఇచ్చిన ఐసీఐసీఐ
- సంస్థ ఖాతాలో జమ అయిన సొమ్ము
- 400 ఎకరాల తనఖాతో రుణ సేకరణ
- 10 ఏళ్లలో తిరిగి చెల్లించనున్న టీజీఐఐసీ
- ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా రుణం
- పొందేందుకు భూమిని బదిలీ చేసిన సర్కార్
- రైతు భరోసా, రైతు కూలీలకు 12వేల భృతికి
- ఈ నిధులను వినియోగించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, డిసెంబరు 26:** తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ)కు ఐసీఐసీఐ బ్యాంకు రూ.10వేల కోట్ల అప్పును మంజూరు చేసింది. ఈ మేరకు రుణం తాలూకు సొమ్ము ఇటీవలే టీజీఐఐసీ బ్యాంకు ఖాతాలో పడినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. టీజీఐఐసీ నుంచి ఈ నిధులు ప్రభుత్వానికి బదిలీ అయ్యాక.. సంక్షేమ పథకాలకు ఉపయోగించుకోనుంది. ముఖ్యంగా రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేల భృతి పథకాలకు వినియోగించవచ్చని తెలుస్తోంది. వడ్డీతో కలిపి మొత్తం రుణాన్ని సొంతంగా చెల్లిస్తానన్న షరతుతో టీజీఐఐసీ ఈ రుణాన్ని తీసుకుంది. ఇందుకోసం 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి ప్రభుత్వం బదిలీ చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమి టీజీఐఐసీకి బదిలీ చేస్తూ జూన్ 26న జీవో 54ను జారీ చేసింది. కోకాపేట పరిసర గ్రామాల్లో నిర్వహించిన వేలం పాటలో పలికిన ధరలను పరిగణనలోకి తీసుకుని ఎకరాకు రూ.75 కోట్లుగా రేటును నిర్ణయించింది. ఈ భూమిని ఐటీ పరిశ్రమలు, ఇతర అవసరాల కోసం వినియోగించాలని తెలిపింది. ఈ క్రమంలోనే భూమిని బ్యాంకుల వద్ద తనఖా పెట్టి రూ.10వేల కోట్ల రుణాన్ని – 2వ పేజీలో

వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం, 27 డిసెంబర్, 2024


## అటకెక్కిన ఆరు గ్యారంటీలు : కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 26:** ఆరు గ్యారంటీలు ప్రకటించి గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలను కూడా అటకెక్కించారని మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టుచేయడం దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో దళిత, బహుజన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తున్నందుకే ఎర్రోళ్లపై కక్షగట్టి అక్రమ కేసులతో వేధించాలని చూస్తున్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి, ఏడో గ్యారెంటీగా ఎమర్జెన్సీని ముఖ్యమంత్రి అమలుచేస్తున్నారు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. నిర్బంధం, అణచివేతతో బీఆర్ఎస్ గొంతునొక్కే విఫల యత్నం చేస్తున్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న నేరాల నియంత్రణలో పూర్తిగా చేతిలెత్తేసి, ప్రధాన ప్రతిపక్షాన్ని ఎలా నియంత్రించాలనే దానిపైనే సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అక్రమంగా అరెస్టుచేసిన ఎర్రోళ్ళ శ్రీనివాస్ ను వెంటనే విడుదల చేయాలి. తప్పుడు కేసులతో రాజకీయ ప్రత్యర్థులను భయపెట్టాలని చూసే విష సంస్కృతికి చరమగీతం పాడాలి. బీఆర్ఎస్ పార్టీకి కేసులు కొత్తకాదు, అరెస్టులు అంత కన్నా కాదు.. ఆత్మగౌరవ పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఇలాంటి బెదిరింపు చర్యలకు భయపడే వారెవరూ లేరంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

## అక్రమ అరెస్టులతో రేవంత్‌రెడ్డి పాలన

### రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి భంగం : హరీశ్‌రావు



**హైదరాబాద్, డిసెంబర్ 26:** సీఎంగా రేవంత్‌రెడ్డి అయిన తరువాత నుంచి అక్రమ అరెస్టులు పెరిగాయని, అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నాడని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టును సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఉదయాన్నే పోలీసులు ఇంటి వద్దకు వచ్చి అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి నోటీసు లేకుండా అరెస్ట్ చేయడం పూర్తిగా అప్రజాస్వామికమన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా.. పోలీస్ రాజ్యమా? అంటూ ఎక్స్ వేదికగా ఫైర్ అయ్యారు. అడిగితే అరెస్టులు.. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే బెదిరింపులు అంటూ విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య పాలన అని డబ్బా కొడుతూ, రాక్షస పాలన కొనసాగిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో కావాలని బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తూ సీఎం నియంతలా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. హోం మంత్రిగా శాంతి భద్రతల నిర్వహణలో విఫలమైన రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించడంపైనే దృష్టి పెట్టారన్నారు. ఈ పైశాచిక ఆనందం ఎక్కువ కాలం నిలవదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మీ పిట్ట బెదిరింపులు, అక్రమ కేసులకు భయపడే వారు మేము కాదని గుర్తుంచుకోండి. తెలంగాణ సమాజమే మీకు తగిన బుద్ధి చెబుతుందని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

## బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్టు



**హైదరాబాద్, డిసెంబర్ 26:** బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు సమయంలో దురుసుగా ప్రవర్తించారంటూ ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈనేపథ్యంలో గురువారం ఉదయం నోటీసులు ఇచ్చేందుకు మారేడ్‌పల్లిలోని ఆయన నివాసానికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున్న శ్రీనివాస్ నివాసానికి చేరుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని మాసబ్‌ట్యాంక్ పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేస్తున్నదని విమర్శించారు. ప్రశ్నించిన వారిని కాంగ్రెస్ సర్కార్ వేధిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. 14 ఏండ్లపాటు ఉద్యమంలో పాల్గొన్నానని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేశానని చెప్పారు. తెల్లవారుజామున వచ్చి ఇంటి డోర్లు కొట్టడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు. ఎన్నికేసులు పెట్టినా, ఎంత నిర్బంధం విధించినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు.

## సినిమా వాళ్ళు బెదరించే ప్రయత్నం

### సిఎం తీరుపై మండిపడ్డ హరీష్ రావు




**హైదరాబాద్, డిసెంబర్ 26:** సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదని బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోందని అన్నారు. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు. రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం భారాస నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం.

# మౌనలోకాలకు మన్మోహన్..

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ 2019 వరకు కొనసాగారు. 2019లో రాజస్థాన్‌కు మారి మరోసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1998 నుంచి 2004 వరకు వాజ్‌పేయీ ప్రభుత్వం ఉన్నప్పుడు రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మన్మోహన్ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలో యూపీఏ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవికి అనేక మంది పేర్లు వినిపించినా అనూహ్యంగా ఈ అవకాశం మన్మోహన్ సింగ్‌కు దక్కింది. 2004 మే 22న మొదటిసారి ఆయన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఐదేండ్ల తన పాలనకు ప్రజామోదాన్ని పొంది 2009లో మరోసారి ప్రధాని అయ్యారు. పదేండ్ల పాటు ప్రధానిగా కొనసాగి, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, నరేంద్ర మోదీ తర్వాత ఎక్కువ కాలం దేశానికి ప్రధానిగా పని చేసిన నాలుగో వ్యక్తిగా రికార్డు సృష్టించారు.

### మన్మోహన్ సేవలు చిరస్మరణీయం: రాష్ట్రపతి

'విద్య, పరిపాలనను సులభంగా నడిపించిన అరుదైన రాజకీయ నేతల్లో మాజీ ప్రధాని మన్మోహన్ ఒకరు. భారత ఆర్థిక వ్యవస్థ సంస్కరణలో ఆయన సేవలు కీలకమైనవి. దేశానికి ఆయన చేసిన సేవలు, నిష్కళంకమైన రాజకీయ జీవితం, ఆయన వినయం చిరస్మరణీయం. ఆయన మరణం మనందరికీ తీరని లోటు' అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.

### ఆర్థిక వ్యవస్థపై బలమైన ముద్ర: ప్రధానమంత్రి

'విశిష్టమైన నాయకుల్లో ఒకరిని కోల్పోవడంతో భారత్ దుఃఖంలో మునిగిపోయింది. వినమ్రమైన మూలాల నుంచి ఆయన గౌరవనీయమైన ఆర్థికవేత్తగా ఎదిగారు. ప్రధానిగా, ఆర్థిక మంత్రి సహా అనేక ప్రభుత్వ హోదాల్లో పనిచేసి దేశ ఆర్థిక వ్యవస్థపై ఆయన బలమైన ముద్ర వేశారు' అని ప్రధాని మోదీ అన్నారు. ప్రధానిగా పని చేసినప్పుడు ఆయనను మౌనమునిగా ప్రతిపక్షాలు విమర్శించేవి. అయితే, ఆయన మౌనంగా ఉంటూనే దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. ప్రధానిగా మొదటి పర్యాయంలో ఆయన దేశ చరిత్రలోనే కీలకమైన ఎన్నో నిర్ణయాలను తీసుకున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సమాచారాన్ని తెలుసుకునే హక్కు సామాన్యులకు ఉండాలనే లక్ష్యంతో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారు. గ్రామీణ ప్రజలకు వ్యవసాయేతర ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో చారిత్రక ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టారు. ప్రతి పౌరుడికి ఒక విశిష్ఠ గుర్తింపు సంఖ్య ఉండాలని ఆధార్ వ్యవస్థను తీసుకొచ్చారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం కోసం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ చేపట్టారు. 2008లో వామపక్షాలు వ్యతిరేకించినా, ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నా అమెరికాలో పౌర అణు ఒప్పందాన్ని చేసుకున్నారు. మన్మోహన్ ప్రభుత్వంలో దేశంలో జరిగిన మార్పులను గుర్తించిన ప్రజలు 2009లో మరోసారి యూపీఏ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారు. 2009 మే 22న మన్మోహన్ సింగ్ రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు.

# నో బెనిఫిట్!

(మొదటి పేజీ తరువాయి)

ఖండించలేదు?' అని ఇండస్ట్రీ పెద్దలను రేవంత్ సూటిగా ప్రశ్నించినట్టు తెలిసింది. పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తున్నామని.. పరిశ్రమ తరపున కూడా ఒక కమిటీని ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. గురువారం హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఫిలిం డెవల్‌పమెంట్ కార్పోరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో పలువురు సినిమా ప్రముఖులు సీఎం రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర డీజీపీ జితేందర్ ఉన్నారు. పరిశ్రమ సమస్యలతోపాటు పలు అంశాలపై సినీ ప్రముఖులు తమ అభిప్రాయాలను రేవంత్‌కు తెలిపారు. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి.. తమ ప్రభుత్వం పరిశ్రమకు ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సినిమా స్టూడియోలకు స్థలాలు, పరిశ్రమవారికి నివాస స్థలాలు, ఫిల్మ్‌నగర్, చిత్రపురి కాలనీ, కార్మికులకు ఇండ్లు, ఇతర సౌకర్యాలను గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే అందించాయని గుర్తుచేశారు. అదే సహకారాన్ని, ఆ వారసత్వాన్ని తాము కూడా కొనసాగిస్తామని భరోసానిచ్చారు. తెలుగు సినిమా పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, పరిశ్రమ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. ఐటీ, ఫార్మా రంగాలు ఎంత ముఖ్యమో.. సినీ రంగం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని తెలిపారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ప్రభుత్వం తరపున అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి 'గద్దర్' పేరిట అవార్డులను ఇచ్చేలా కొత్త ఒరవడిని తీసుకొచ్చామని.. ప్రభుత్వానికి, పరిశ్రమకు అనుసంధానకర్తగా ఉండేందుకు దిల్‌రాజును ఫిలిం డెవల్‌పమెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించామని గుర్తుచేశారు. దేశంలోని కాస్మోపాలిటన్ నగరాల్లో హైదరాబాద్ ఉత్తమమైనదని.. ఇక నుంచి హాలీవుడ్, బాలీవుడ్ వాళ్లు కూడా హైదరాబాద్‌కు వచ్చేలా చర్యలు చేపడుతామని చెప్పారు. ఇందుకోసం త్వరలో హైదరాబాద్‌లో పెద్ద సదస్సు ఏర్పాటుచేసి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయాలని.. గంజాయి, డ్రగ్స్ నిరోధంతో పాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలని సూచించారు. "సినిమా వాళ్లు ఫంక్షన్లు చేసుకోవచ్చు మాకు ఏమీ అభ్యంతరం లేదు, అన్ని అనుమతులూ ఇస్తాం. కానీ అభిమానులను నియంత్రించే వ్యవహారాన్ని నిర్వాహకులు, సెలబ్రిటీలే చూసుకోవాలి. బౌన్సర్లు పోలీసు అధికారులనే అడ్డుకుంటున్నారు. దానిని ఎట్టి పరిస్థితుల్లో సహించం. అలా అడ్డుకుంటే బౌన్సర్లతో పాటు.. సెలబ్రిటీలపైనా కేసులు పెడతాం" అని కూడా సీఎం అన్నట్టు సమాచారం.

### అది నా బాధ్యత

సినీ పరిశ్రమ అభివృద్ధికి మొదటి తరంలో నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్), మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో చంద్రబాబు, వైఎస్ సహకరించారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు మూడో తరంలో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే సహకారాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా సినీ కార్మికుల సంక్షేమానికి ప్రభాకర్‌రెడ్డి చేసిన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో చిరంజీవి కష్టపడి కిందిస్థాయి నుంచి ఎదుగుతూ మెగాస్టార్ స్థాయికి చేరారని, తాను కూడా కిందిస్థాయి నుంచి సీఎం స్థాయి వరకు ఎదిగానని అన్నారు. ఎవరి లక్ష్యాలు, గమ్యాలు వారికి ఉన్నాయి కాబట్టే ఇక్కడ వరకు చేరుకోగలిగామని, ఎవరి స్టైల్ వారికి ఉంటుందని వ్యాఖ్యానించారు. సినిమా వారికి రాజకీయాలతో సంబంధం లేదని, ఆ సంగతి తాము చూసుకుంటామని సీఎం ఒక దశలో కొంత ఘాటుగా చెప్పినట్టు తెలిసింది. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలుచేయాల్సిన బాధ్యత తనపై ఉందని.. అందరినీ సమానంగా చూడడమే తప్ప, ఎవరిపైనా తనకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవని ఈ భేటీలో ఆయన స్పష్టం చేశారు. ఒక్క తెలుగుకే పరిమితం కాకుండా అన్ని భాషల సినిమాల నిర్మాణానికీ ఇక్కడ అవకాశం ఉండేలా అందరం కలిసి అభివృద్ధి చేద్దామన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో, ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని సినీ పరిశ్రమకు పిలుపునిచ్చారు.

### ఆ ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దు

అల్లు అర్జున్, రామ్‌చరణ్, రానా చిన్నప్పటి నుంచి తనకు తెలుసని.. ఇప్పుడు సూపర్‌స్టార్లుగా ఎదిగిన ఆ ముగ్గుర్నీ చూస్తుంటే సంతోషంతోపాటు గర్వంగా కూడా ఉందని సీఎం పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 8 సినిమాలకు ప్రత్యేక జీవోలు ఇచ్చిందని, 'పుష్ప' సినిమాకు పోలీసు భద్రత ఇచ్చామని గుర్తుచేశారు. అయినా.. ప్రభుత్వానికి, పరిశ్రమకు మధ్యదూరం పెరిగిందనే ప్రచారం జరుగుతోందని.. అలాంటి ప్రచారానికి ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. ఇలాంటి ప్రచారం వల్ల ప్రభుత్వానికంటే పరిశ్రమకే ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా.. సినిమాలకు పెద్దగా లాభాలు లేకపోయినా నిర్మాతలు ఇండస్ట్రీపై ప్రేమతో చిత్రాలు తీస్తున్నారని, రాష్ట్రంలో 300కు పైగా సింగిల్ థియేటర్లు మూతపడ్డాయని సినీ ప్రముఖులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## సినీపరిశ్రమ నుంచి సెస్ వసూలు యోచన: భట్టి

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాలకు సినీ పరిశ్రమ నుంచి కొంత సుంకాన్ని తీసుకోవాలనే యోచనలో ఉన్నామని, ఇందుకు పరిశ్రమ సహకరించాలని.. ఈ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే, డ్రగ్స్, గంజాయి వంటి వాటిపై పరిశ్రమ ప్రచారం చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం 'రైజింగ్ తెలంగాణ' నినాదంతో ముందుకెళ్తోందన్న భట్టి.. ఇప్పటికే ఫ్యూచర్ సిటీ, స్కిల్ యూనివర్సిటీలను ఏర్పాటుచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. సినీపరిశ్రమకు ఏదైనా మేలు జరిగిందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నేనని.. ఆ కోవలోనే తమ ప్రభుత్వం కూడా సహకరిస్తుందని తెలిపారు.

### సినిమాటోగ్రఫీ వద్దు అన్నా: మంత్రి కోమటిరెడ్డి

ప్రభుత్వం సినీ పరిశ్రమను అభివృద్ధి చేసే ఉద్దేశంతోనే ఉందని.. వేరే ఉద్దేశాలేవీ లేవని ఈ భేటీలో పాల్గొన్న సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా తనకు ఆర్ అండ్ బీతో పాటు సినిమాటోగ్రఫీ శాఖను ఇస్తున్నట్టు సీఎం రేవంత్ చెప్పినప్పుడు.. తనకు సినిమాటోగ్రఫీ వద్దని చెప్పానని, వీలైతే క్రీడల శాఖను ఇవ్వాలని కోరానని.. కానీ అది సాధ్యపడలేదని చెప్పి సమావేశంలో ఆయన నవ్వులు పూయించారు.

### తేడా వస్తే కేసులే: డీజీపీ జితేందర్

సినిమా వాళ్లు నిర్వహించుకునే ఫంక్షన్లకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని ఈ సమావేశంలో పాల్గొన్న డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. అయితే బౌన్సర్ల సంస్కృతి సరైంది కాదని అయన అభిప్రాయపడ్డారు. ఒక్కోసారి బౌన్సర్లు పోలీసులను కూడా నిలువరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో తేడా వస్తే బౌన్సర్లపైనే కాక నిర్వాహకులపైనా కేసులు, చర్యలు ఉంటాయని డీజీపీ హెచ్చరించారు.

## రూ.10వేల కోట్లు వచ్చినయ్!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకునేందుకు టీజీఐఐసీ.. బ్యాంకులతో సంప్రదింపులు జరిపింది. కరూర్ వైశ్యా బ్యాంకు, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకులురుణాలు ఇవ్వడానికి ముందుకొచ్చాయి. ఐసీఐసీఐ బ్యాంకు వార్షిక వడ్డీ(9.6 శాతం) తక్కువగా ఉండడంతో ఆ బ్యాంకు నుంచి రుణం తీసుకోవడానికి టీజీఐఐసీ సిద్ధమైంది. ఈ మేరకు బ్యాంకుతో ఒప్పందం కూడా పూర్తయింది. దీని ప్రకారం నెలాఖరులోగా అప్పు అందాల్సి ఉంది. అన్నట్లుగానే... ఐసీఐసీఐ నుంచి టీజీఐఐసీకి రుణం సొమ్ము అందింది.

### టీజీఐఐసీ ద్వారానే తిరిగి చెల్లింపు...

ప్రస్తుతం తీసుకున్న రూ.10వేల కోట్ల అప్పును తిరిగి టీజీఐఐసీ సొంతంగా చెల్లిస్తుందని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. ప్రభుత్వం గచ్చిబౌలిలోని 400ఎకరాల భూమిని టీజీఐఐసీకి కేటాయించింది. ఎకరాకు రూ.75కోట్ల చొప్పున మొత్తం రూ.30వేల కోట్ల విలువైన భూముల్ని బదిలీ చేసింది. అంటే ప్రభుత్వం ఒక రకంగా ఆ భూమిని టీజీఐఐసీకి అమ్మేసినట్లే. దానికి సంబంధించిన మొత్తాన్ని చెల్లించే ప్రక్రియలో భాగంగా టీజీఐఐసీ రూ.10వేల కోట్ల రుణాన్ని తీసుకుంది.

# తెరమీదకు వీఆర్వో వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ దిశగా నిర్ణయం తీసుకున్నారు. అయితే సర్కార్ నిర్ణయం పై విఆర్వోలు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసినప్పటికీ చివరికి వెనక్కి తగ్గారు. వీరందరినీ పలు శాఖల్లోకి కూడా సర్దుబాటు చేసింది. వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థల రద్దుతో క్షేత్రస్థాయిలో పలు సమస్యలు తెరపైకి వస్తున్నాయి. ఏదైనా భూ సమస్య లేదా ఇతర అంశాలకు సంబంధించిన సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే తప్పనిసరిగా ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుంది. గతంలో విఆర్వోలకు ఫిర్యాదు చేయడం లేదా వారి దృష్టికి తీసుకెళ్తే సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడేవి. లేదా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లేది. ప్రస్తుతం వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థ లేకపోవడంతో స్థానికంగా ఉండేవాళ్ళు తాసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుంది. అయితే ధరణి ఆన్లైన్ సేవలు వచ్చిన తర్వాత చాలా సేవలు ఆన్లైన్ ద్వారానే జరిగిపోతున్నాయి. తద్వారా చాలా అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు తగ్గినప్పటికీ కొన్నింటి పరంగా ఇబ్బందులు తప్పడం లేదు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం నిర్ణయాలను పునర్సమీక్షిస్తోంది. అందులో భాగంగా కొత్త ఆర్ఓఆర్ చట్టాన్ని తీసుకురానుంది. ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ముసాయిదా బిల్లును సిద్ధం చేసి ప్రజాభిప్రాయాలను కూడా సేకరించింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ సమావేశాల్లోనే కొత్త ఆర్ఓఆర్ (ది తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్స్ బిల్లు 2024) ముసాయిదాను ప్రవేశపెట్టి చట్టంగా మార్చే పనిలో ఉంది. ఈ ముసాయిదా ప్రకారం తాసిల్దార్లతో పాటు ఆర్డీవోలకు మ్యూటేషన్ చేసే అధికారం ఇస్తూ విచారణకు అవకాశం కల్పిస్తుండగా తప్పుగా తెలిస్తే ముటేషన్ నిలిపివేసే అధికారాలను కట్టబెట్టనుంది. ప్రతి భూ కమతానికి భూ ఆధార్ ఉండనుంది. హక్కుల బదలాయింపు జరగగానే గ్రామ పహానిలో మొదలు చర్యలు తీసుకుంటారు. అప్పీల్, రివిజన్లకు వెసులుబాటు కల్పిస్తూ బిల్లును రూపొందించారు. బిల్లులో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రతి భూకమతానికి తాత్కాలిక శాశ్వత భూదార్ ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుత రికార్డును పరిశీలించి తాత్కాలిక సంఖ్య ఇస్తారు. సర్వే చేసిన తర్వాత శాశ్వత భూదార్ కేటాయిస్తారు. 2020లో తీసుకొచ్చిన ఆర్ఓఆర్ చట్టం ప్రకారం చాలా ఇబ్బందులు ఉన్నాయి. రివిజన్ వ్యవస్థ లేకపోవడంతో భూ యజమానులకు అనేక సమస్యలు ఏర్పడ్డాయి. కలెక్టర్లకు ఎక్కువ అధిగారాలు ఉండడంతో క్షేత్రస్థాయిలోని అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఉండేది. అయితే కొత్త చట్టంలో మూడంచల అప్పిలేట్ అథారిటీలను నియమించనున్నారు. తాసిల్దార్, ఆర్డీవోల మ్యూటేషన్ల పై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉంది. త్వరలోనే ఈ చట్టానికి సంబంధించి పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది. మరోవైపు వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను కూడా పునరుద్ధరించాలని సర్కార్ నిర్ణయించింది. ఈ విషయమై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పలుమార్లు కీలక ప్రకటనలు చేశారు. వచ్చే సంక్రాంతి లోపు రాష్ట్రంలోని 10956 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ అధికారులను నియమిస్తామని చెప్పుకొచ్చారు. దీని ద్వారా రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని సర్కారు గుర్తించింది. వీఆర్వోలు, వీఆర్ఏలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఉన్నాయని భావిస్తోంది. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో కూడా క్షేత్రస్థాయిలో అధికారులు లేకపోవడం పెద్ద సమస్యగా మారుతుందని గుర్తించింది. ఈ క్రమంలోనే తిరిగి పాత రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని యోచిస్తుంది. తద్వారా ప్రజలకు ఉండే ఇబ్బందుల పరిష్కారం సులువుగా అవుతుందని భావిస్తుంది. ఇందుకు సంబంధించి వచ్చే జనవరిలో కీలక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. పునరుద్ధరణలో భాగంగా కేవలం వీఆర్వోలు మాత్రమే ఉంటారా? వీఆర్ఏలను కూడా తీసుకొస్తుందా? అనేది చూడాలి.

# నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన
# నాయకుడు వంగవీటి మోహనరంగా

**మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

**కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి**

కూకట్ పల్లిబీ డిసెంబర్ 26(వాయిస్ టుడే) నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన ప్రజా నాయకుడు దివంగత నేత వంగవీటి మోహన రంగా అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు అన్నారు. వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్ధంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా టెంపుల్ బస్ స్టాప్ లో గల వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా మైనంపల్లి హనుమంత రావు మాట్లాడుతూ నాయకుడంటే నమ్మిన వారికి, ప్రజలకు కష్ట, సుఖాలలో వెన్నంటి ఉన్నవారే నాయకులని ఆ కోవలో దివంగత నాయకుడు వంగవీటి మోహన రంగా ముందు వరుసలో ఉంటారన్నారు. బడుగు బలహీన వర్గాల నాయకున్ని ప్రజలు అభిమానులు నాయకులు ఎప్పటికీ మరువరు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు వంగవీటి మోహన రంగా ప్రజల్లో నిలిచి ఉంటారన్నారు. వంగవీటి మోహన రంగా రాజకీయ జీవితం పేద ప్రజల అభ్యున్నతికి, పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు కృషి చేశారని కొనియాడారు. వంగవీటి మోహన రంగా ధైర్యానికి, సాహసానికి నిలువెత్తు సాక్ష్యం అన్నారు. ఈ తరం నాయకులు వంగవీటి మోహన రంగాను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి కూకట్ పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు బి బ్లాకు అధ్యక్షులు తూము వేణు, కమిటీ సభ్యులు భరత్, ఎల్ రాజా,డి రంగారావు, గంధం రాజు, ప్రవీణ్ కుమార్, ఫణీంద్ర కుమార్, రేష్మ, నితీష్ గౌడ్, గిరి నాయుడు, శ్రీధర్ చారి, తదితరులు పాల్గొన్నారు.





## ఆవోపా హైదరాబాద్ ఆధ్వర్యంలో ఏడవ వధూవరుల పరిచయ వేదిక

బుధవారం హైటెక్స్లోని నోవాటెల్ హోటల్లో ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో పెళ్లీడు ఉన్న ఆర్యవైశ్య అమ్మాయిలు మరియు అబ్బాయిలు సుమారు 110 మంది పాల్గొని పరస్పర పరిచయాలు చేసుకున్నారు. వాతావరణం సంపూర్ణంగా పెళ్లి వేడుకగా మారింది.ఈ కార్యక్రమానికి దాదాపు 500 మంది హాజరయ్యారు. ఉదయం 9:30 గంటలకు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేదిక రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. ముఖ్య అతిథులుగా రమేష్ గెల్లి మరియు తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ సుజాత హాజరై తమ స్ఫూర్తిదాయకమైన మాటలతో కార్యక్రమాన్ని మరింత ప్రోత్సహించారు.



## కూకట్‌పల్లిలో ఘనంగా కీ.శే. వంగవీటి మోహన రంగా వర్ధంతి వేడుకలు

కూకట్‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) దివంగత నేత వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం, కె పి హెచ్ బి కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్ వద్దగల అయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్ గౌడ్ మరియు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాలానగర్‌లో భారత కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థపాక శతబ్ది ఉత్సవాలు

**కూకట్‌పల్లి మండల సీపీఐ కార్యదర్శి జి. కృష్ణ**



కూకట‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) భారత కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థపాక శతబ్ది ఉత్సవాల సందర్భంగా కూకట్ పల్లి మండల పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ నుండి శ్రీశ్రీ నగర్ సీపీఐ పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ పరిధిలోని శ్రీశ్రీ నగర్ శాఖ కార్యదర్శి కె. మనోచారి అధ్యకతన నిర్వహించిన కార్యక్రమనికి సీపీఐ కూకట్ పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ముఖ్య అతిధిగా హాజరై జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జి. కృష్ణ మాట్లాడుతూ పేద ప్రజల కోసం, వారి హక్కుల కోసం, సమసమాజ నిర్మాణం కోసం సోషలిజం రావాలని, సమాన హక్కులు ప్రతి ఒక్కరికి వరించాలని పోరాటం చేసిన పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ 100 ఏళ్ల చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఈ మేరకు సిపిఐ శత జయంతి ఉత్సవాలను నియోజకవర్గంలోని వాడవాడల్లో పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు నాయకులు ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలనారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కూకట్ పల్లి మండల నాయకులు శివ ప్రసాద్, షణ్ముఖ్ రావు, కె. కృష్ణ, రాములు, దావీద్, రాజు గౌడ్, నారాయణ్, ఉమారాణి, చంద్రమ్మ, రిజ్వాన, తదితరులు పాల్గొన్నారు.



## పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్**

కూకట్ పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా అని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. మోహన్ రంగా వర్ధంతి సందర్భంగా కెపిహెచ్బి కాలనీ బస్టాండ్‌లో ఆయన విగ్రహానికి బుధవారం రాత్రి రమేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టేముక్కల వెంకటేశ్వరరావు, శివ చౌదరి, బచ్చు మల్లి, కాపు సంఘ ప్రెసిడెంట్ భరత్, ఎల్ రాజా, రంగమోహన్, గంధం సోదరులు, కాపు సంఘ పెద్దలు,కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్, ఏఎంసి డైరెక్టర్ ఫణీంద్ర కుమార్, నళినీకాంత్ రంగా అభిమానులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం గచ్చిబౌలి లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన కాంగ్రేస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్, భూపతి రెడ్డి తదితరుల దృశ్యం.

– ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి)



## కూకట్‌పల్లి మండల శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధిలో తెలంగాణ పీఆర్టీయు కూకట్ పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్ క్యాలెండర్ ఆవిష్కరించారు, పీఆర్టీయు ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, కూకట్ పల్లి పీఆర్టీయు మండల అధ్యక్షులు వెంకట్, మండల ప్రధాన కార్యదర్శి విట్టల్. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేందర్ గౌడ్, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ నాయని చంద్రశేఖర్ , మండల వైస్ ప్రెసిడెంట్ వీరేందర్, జిల్లా కార్యదర్శి ప్రదీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత నేత బడుగు బలహీన వర్గాల
# ఆశాజ్యోతి వంగవీటి రంగా వర్ధంతి





## కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి సందర్భంగా రాధా రంగ మిత్రమండలి కూకట్ పల్లి కాపు సంఘ సభ్యులు మరియు అధ్యక్షుడు మోటే పల్లి భరత్ కుమార్ ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్ పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా బడుగు బలహీన వర్గాల కొరకు మరియు ప్రజా సమస్యల కొరకు పోరాడి తన ప్రాణాలు సైతం అర్పించిన మహా నాయకుడు అని, రంగా ను ఆదర్శంగా తీసుకొని మనం అందరం పేద ప్రజలకు సేవ చేసే మార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ నాయకులు వీర మహిళలు వివిధ పార్టీ నాయకులు , కాలనీవాసులు మరియు రంగా అభిమానులు పాల్గొన్నారు



## పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా వర్ధంతి వేడుకలు

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వంగవీటి కి ఘనంగా నివాళు లు అర్పించారు. కి శే వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాసరావు, శిరీషా బాబురావు, నియోజక వర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా రంగమోహన్, కూకట్ పల్లి కాపు సంఘము అధ్యక్షుడు యం. భరత్ కుమార్, పులి మురళి, వలనాయుడు, బాలాజీ, నాగేశ్వరావు, పాపారావు, పున్నారావు పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు.



## ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆకుల నరేందర్ ఎన్నిక

కూకట్‌పల్లి, డిసెంబర్ 26(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఆకుల నరేందర్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న వారిలో ఆకుల నరేందర్ ముదిరాజ్, పంజా రామచందర్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్ ఉన్నారు. మొదట ఈ ముగ్గురిలో ఎవరినైనా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం కోసం ప్రయత్నాలు చేయగా ఎవరికీ సఖ్యత కుదరలేదు, చివరకు ఎన్నిక అనివార్యం అయింది. చివరకు పంజా రామచందర్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్ మీద పోటీ పడి ఆకుల నరేందర్ ముదిరాజ్ విజయం సాధించారు. వర్కిన్ ప్రెసిడెంట్ గా బాలింగ్ రాము ముదిరాజ్ ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా పి.రాజు, కోశాధికారిగా విజేందర్ కుమార్ నియమించబడ్డారు. మహిళా ముదిరాజ్ విభాగానికి అధ్యక్షురాలిగా కళకుంట్ల స్వాతి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుట్ట తులసి, ప్రధాన కార్యదర్శిగా మునగాల సోని నియమింప బడ్డారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ముదిరాజ్ ల ఐక్యత సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. అందరినీ కలుపుకుంటూ సంఘం అభివృధికి కృషి చేస్తానని అన్నారు.



## ఆకట్టుకున్న భరతనాట్య నృత్య ప్రదర్శనలు

బషీర్‌బాగ్, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే): మంజీరం అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ మూడవ వార్షికోత్సవ వేడుకలను గురువారం కింగ్ కోఠి లోని భారతీయ విద్యా భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి పరిణయం, అన్నమాచార్య సంకీర్తనలతో చేసిన భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం సంస్థ వ్యవస్థాపకురాలు సురాగా ప్రసాద్ యీరవల్లి మాట్లాడుతూ.. శాస్త్రీయ నృత్య ప్రదర్శనలను నేర్పించడంతో పాటు వాటిలో ఉండే భావాన్ని సైతం విద్యార్థులకు నేర్పించాలనేది తమ లక్ష్యం అని తెలిపారు. భరతనాట్యం ఎంతో ముఖ్యమైందని, నాట్యంతో పిల్లలకు మన ఆధ్యాత్మికత ఆలోచనలను తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అంతేకాకుండా భరతనాట్యం నేర్చుకోవడం వల్ల పిల్లలకు ఆత్మవిశ్వాసం పెంపొందించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహిత్య కల్ప వ్యవస్థాపకురాలు సాహిత్య రామ్ కుమార్ లతోపాటు పలువురు నాట్య గురువులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి


### జిల్లా ఆయిల్ ఫెడ్ అధికారి రాములు



తొర్రూరు, డిసెంబర్ 26 వాయిస్ టుడే : ఆయిల్‌ఫామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఆయిల్ ఫెడ్ అధికారి సిహెచ్. రాములు కోరారు. జిల్లాలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో జరిగిన కిసాన్ మేళా, వ్యవసాయ ప్రదర్శనలో ఆయిల్ ఫామ్ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ జిల్లాలో 8500 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు ఉందని, 300 పై చిలుకు ఎకరాల్లో పంట (కోతకు) దిగుబడికి సిద్ధంగా ఉందన్నారు. ఈ ఏడాది లక్ష మొక్కలను రైతులకు అందించడం జరిగిందని,హరిపిరాలలో ఉన్న నర్సరీలో 4లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. డీడీలు కట్టిన రైతులు పామ్ ఆయిల్ మొక్కలను తీసుకోవాలన్నారు. ఆయిల్ ఫామ్ విస్తరణకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఆయిల్‌పామ్ సాగులో చీడపీడలు, వర్షాలు, కోతులు, అడవి పందులు, గాలివానలతో ఎలాంటి నష్టం ఉండదన్నారు. అలాగే ఆయిల్ పామ్ తోటలో అంతర పంట లను సాగు చేసుకోవచ్చన్నారు. రైతులు పండించిన వీటి గెలల విక్రయాల కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. తొర్రూరు శివారు గోపాలగిరి గ్రామంలో పరిశ్రమ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఫ్యాక్టరీ వరకు పంట రవాణా ఖర్చులను పూర్తిగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ భరిస్తుందని తెలిపారు. ఈ పంటకు చీడపీడలు, కోతుల బెడద దొంగల బెడద లేదని తెలిపారు. రైతులు ఆయిల్ ఫామ్ పంట సాగు చేసి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందాలని కోరారు. మూడేళ్లు కష్టపడితే కొన్ని ఏళ్ల పాటు దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకం

### బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి



తొర్రూరు, డిసెంబర్ 26 వాయిస్ టుడే : సమాజాభివృద్ధిలో,ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకమని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. మేధావి వర్గమైన న్యాయవాదులు తమ కుటుంబంతో పాటు వ్యవస్థలోని రుగ్మతలపై నిత్యం స్పందించాలనీ పిలుపునిచ్చారు. గురువారం తొర్రూర్ బార్ అసోసియేషన్ ను సందర్శించిన ఆయన ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా తొర్రూర్ న్యాయవాదులకు నూతన సంవత్సర డైరీలను అందజేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కలువకొలను ప్రవీణ్ రాజు, జనరల్ సెక్రటరీ ఆర్కే ఘనపురం , సీనియర్ న్యాయవాదులు బండపల్లి వెంకన్న, ముకుందరావు, వల్లపు మహేష్, వల్లపు మధుసూధన్, ముకుందరావు,అజయ్ కుమార్,ఐలోని, శ్రీశైలం,లాలు, మైలపాక అశోక్, గోపాల్, సైదులు,నగెష్,గంపల ప్రవీణ్, ఎల్లేష్,పల్లవి,విజయ, యాకేందర్ తదితరులు పాల్గొన్నారు .

# పోరాటయోధుడు, పేదల ఆరాధ్యదైవం కామ్రేడ్ కేవల్ కిషన్

### ప్రజలు ఒక వ్యక్తిని అభిమానిస్తే, గుండెల్లో పెట్టుకుని కొలుస్తారు అనడానికి నిదర్శనమే కేవల్ కిషన్..

### ఆయన పోరాటం నేటి తరానికి స్ఫూర్తి

### నీలం మధు ముదిరాజ్



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: పేదల సంక్షేమం కోసం పరితపించిన పోరాట యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో స్వర్గీయ కేవల్ కిషన్ ముదిరాజ్ స్మారకర్తము ఆయన సమాధి వద్ద ప్రతి సంవత్సరం నిర్వహించే జాతరలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్,ఎం ఎల్ సి శుభాష్ రెడ్డి,తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, కెవల్ కిషన్ కూతురు డాక్టర్ వీణ కుమారి తో కలిసి నీలం మధు పాల్గొని ఆయన సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజల హక్కుల కోసం పోరాటం చేసి ప్రజల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు కేవల్ కిషన్ అన్నారు. మెదక్ ప్రాంతంలోని జమిందారుల ఆగడాలతో విసిగి వేసారిన పేదలను ఒక్కటి చేసి ప్రజాపోరాటాలు నిర్వహించారని తెలిపారు. దున్నేవాడికే భూమి అంటు భూ పోరాటాలు చేసి పేదలకు భూములు పంచిపెట్టారని కొనియాడారు. అలాగే కార్మికుల కోసం అనేక పోరాటాలు చేసి హక్కుల సాధనకు కృషి చేశాడన్నారు. అలాంటి మహనీయున్ని ప్రజలు స్మరించుకుంటు ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి చుట్టూ ఎడ్లబండ్లను తిప్పుతూ జాతరను చేయడం ప్రశంసనీయమని తెలిపారు. ప్రజల కోసం జీవించి ప్రాణాలర్పించిన మహనీయులని ప్రజలు తమ గుండెల్లో పెట్టుకొని కొలుస్తారనడానికి నిదర్శనమే కెవల్ కిషన్ పోరాటం అన్నారు. అలాంటి మహనీయుని స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు పుట్టి అక్షయ్, మాజీ సర్పంచ్ సత్యం,స్వరూప, సత్యనారాయణ, గోపాలకృష్ణ, శ్రీకాంత్,శివన్న, బోయిని అరుణ, HCU, OU సంతోష్,దుబ్బాక భాస్కర్,జలిగారి ఎట్టయ్య, సుంకరబోయిన మహేష్, నారబోయిన శ్రీనివాస్,పిల్లుట్ల గంగాధర్, సదుల్నగర్ కృష్ణ, సత్యం, మణిదీప్,తలారి భిక్షపతి, ఉత్సవ నిర్వాహకులు, తధితరులు పాల్గొన్నారు.



## టోకెన్ సమ్మెను జయప్రదం చేయండి

తొర్రూరు, డిసెంబర్ 26 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో జరుప తలపెట్టిన టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పాడియ బీకు అన్నారు. గురువారం తొర్రూరులోని టి యు సి ఐ కార్యాలయంలో జరిగిన తొర్రూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 60 వేల మంది గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవటం లేదని అన్నారు. 12000 గ్రామపంచాయతీలలో ప్రజల ఆరోగ్యాలను కాపాడుతూ శుభ్రత పరిశుభ్రత పాటిస్తూ జీవితాలను త్యాగం చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. గత పది నెలలుగా వేతనాలు అందక అప్పులు తెచ్చుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న గ్రామపంచాయతీ కార్మికులు పట్టణాలకు వలస పోతున్న దౌర్భాగ్యకరమైన పరిస్థితి తెలంగాణలో నెలకొందని అన్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇస్తూ పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిసెంబర్ 27,28 తేదీలో జరుప తలపెట్టిన టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని బీకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి యూనియన్ మండల అధ్యక్షుడు గుండాల సోమనరసయ్య అధ్యక్షత వహించగా మండల నాయకులు యాకయ్య, శివ, రవీందర్, బాలు,మహేష్ మురళి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డికి కడియం శుభాకాంక్షలు

ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాల) వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయనను మాజీ ఉపముఖ్యమంత్రి స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియం వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆకాంక్షించారు.

## పాలకుడిలా కాకుండా సేవకుడిలా అభివృద్ధి చేస్తున్నా

### వసతులు కల్పించని నాయకులు ఇప్పుడు మాట్లాడటం సిగ్గుచేటు

### సామజిక మధ్యమాల్లో ప్రశ్నించడం వలన జరిగేది ఏమి లేదు



వరంగల్ : అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని సమయానూసారంగా ప్రతి కాలనీ అభివృద్ధి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, ప్రధానకార్యదర్శి బొల్లారపు సదయ్య వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కొబ్బరికాయ శంకుస్థాపన చేసారు. అనంతరం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్ గెలిచిన మీడియా మిత్రులకు ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి బహుమతులు ప్రదానోత్సం చేసారు. పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీ నాయకులు చేసింది ఏమి లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కనపడుతుందని, పదేళ్లలో అభివృద్ధి చేయకుండా రాజకీయ పబ్బం గడిపి ఇప్పుడు అభివృద్ధి పట్ల మాట్లాడటం సిగ్గుచేటు అని విమర్శించారు. ఓడిపోయిన తరువాత నాయకులు ఇంట్లో కూర్చొని సామాజిక మధ్యమాల్లో ప్రశ్నించడం వలన ఒరిగేదేమిలేదని నాయిని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలలో ప్రతి ఒక్కటి అమలు చేస్తూ అప్పుల ఊబీలో ఉన్న రాష్ట్రాన్ని మెరుగు పడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటి ఆకస్మిక తనిఖీ

ఖమ్మం బ్యూరో డిసెంబర్ 26 ( వాయిస్ టుడే) దమ్మపేట ఎమ్మార్వో కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి పొంగులేటి రికార్డులు పరిశీలించి కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి ఇన్ చార్జి ఎమ్మార్వోని అడిగి తెలుసుకున్న మంత్రి-రికార్డులో పొందుపరిచిన వివరాలను చూసి నేరుగా బాధితులకు అందుతున్న సేవల గురించి ఫోన్ ద్వారా తెలుసుకున్న మంత్రి.

# ఫతేపూర్ మైసమ్మ చైర్మన్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా డిసెంబర్ 26: జడ్చర్ల బీనవాబుపేట్ మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయ పాలకవర్గ ప్రమాణస్వీకారం మహొత్సవానికి ముఖ్యఅతిథిగా జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి.ముఖ్యఅతిథిగా డిసిసి మాజీ అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డిలు హాజరైనారు.ముందుగా ఆలయ అర్చకులు ఆనవాయితీ ప్రకారం ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డికి పూర్ణ కలశంతో స్వాగతం పలికారు.అనిరుద్ రెడ్డి నూతన పాలకవర్గ సభ్యులతో కలసి సామూహికంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత,అమ్మవారి ఆలయ మంటపంలో ఈవో మదనేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో నూతన చైర్మన్ తిప్పారెడ్డి జగన్మోహన్ రెడ్డి,పాలకవర్గ సభ్యులుగా పాశం రామస్వామి,గడ్డమీది మల్లయ్య,కేతావత్ మెగ్యా,పాశం శివరాజు,బొప్పటి రవీందర్,వల్కే ఆంజనేయులు, పిచ్చకుంట్ల శాంతయ్య,అంకం రమాదేవి, మురుగని బాలకృష్ణయ్య, కట్ట బాలస్వామి,బక్క నరసింహులు, బి.రవి, మంగలి రామచంద్రయ్యలతో ప్రమాణ స్వీకారం చేయించారు, ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్,పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. తదనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా ఎన్నికైన ఆలయ పాలకవర్గ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ,గతంలో జగన్మోహన్ రెడ్డి మైసమ్మ ఆలయ చైర్మన్ గా ఉన్నప్పుడు ఆలయంలో జరిగే అన్యాయాన్ని ప్రశ్నించినందుకు తొలగించాలని, ఆయన నిజాయితీ మళ్లీ బుధవారం ఆయనను చైర్మన్‌గా నిలబెట్టిందన్నారు. ఇకనుండి ఆలయంలో ఏ రాజకీయ నాయకుని కార్యక్రమానికి ఆలయ డబ్బులను ఖర్చు చేయరాదని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా పరిధిలో పాల్గొన్నారు

# ఖమ్మం నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలి

## యర్రా శ్రీకాంత్ డిమాండ్



ఖమ్మం, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ) ఖమ్మం నగర అభివృద్ధికి నిధులు కేటాయించాలి. అని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కమిటీ సమావేశం సిపిఎం ఖమ్మం డివిజన్ నాయకులు ఎల్లంపల్లి వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్ మాట్లాడుతూ ఖమ్మం మున్నేరు పై తీగల వంతెన. మున్నేరుకి ఇరువైపులా కరకట్ట కట్టాలి . మున్నేరు కరకట్ట పనులు తొందరగా పూర్తయ్యేటట్లు మంత్రులు అధికారులు మరల వర్షాకాలం వచ్చేసరికి మళ్లీ వరదప్రాహముకు గురికాకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. శివారు ప్రాంతాలలో రోడ్లు డ్రైన్లు విద్యుత్ సౌకర్యం కల్పించాలి . నగరం విస్తరిస్తుంది. రహదారులు పి ఎస్ ఆర్ రోడ్ బస్ డిపో రోడ్ కొత్త బస్టాండ్ రోడ్ నెహ్రు నగర్ రోడ్ రిక్కా బజార్ రోడ్లు ఆధునికరించాలి. గోళ్ళపాడు కాలువ పైన ఏర్పాటుచేసిన పార్కులన్నీ సుందరీకరణ చేయాలి జాలి తీగలు తీసివేసి పార్కు చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలి ఈ నిర్మాణ పనులపై ఖమ్మం ఎమ్మెల్యే వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరావు ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుంది మరియు ఇందిరమ్మ ఇండ్లు రాజకీయ జోక్యం లేకుండా అర్హత కలిగిన వారందరికీ అందించాలని కోరుతున్నాము. పైరవులకు తావి వద్దని అలాంటివి మంత్రిగారి దృష్టికి వస్తే కఠినంగా వ్యవహరించాలని కోరుచున్నాము. అలాగే వృద్ధాప్య పింఛన్లు వితంతువు పింఛన్లు 2000 నుండి 4000 రూపాయలకు పెంచాలని వికలాంగులకు 4వేల రూపాయలు నుండి 6000 రూపాయలకు పెంచాలని కొత్త రేషన్ కార్డులు కూడా వెంటనే మంజూరు చేయాలని రేషన్ కార్డులకు ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవాలని దరఖాస్తులు తీసుకున్న వెంటనే విచారణ జరిపి రేషన్ కార్డులు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, సిపిఎం ఖమ్మం త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, పత్తిపాక నాగ సులోచన, షేక్ హిమామ్, ఎర్ర రంజిత్ ,షేక్ సైదులు, బండారు వీరబాబు, పోతురాజు జార్జి, మద్ది సత్యం, శీలం వీరబాబు, వేల్పుల నాగేశ్వరరావు, కొట్టే అలివేలు, బండారు సునీత, గబ్బేటి పుల్లయ్య, సారంగి పాపారావు, యర్రా నగేష్, చీకటిమల్ల శ్రీనివాసరావు, షేక్ బాబు, షేక్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేటలో ఘనంగా వేం జన్మదిన వేడుకలు

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: ప్రభుత్వ ముఖ్య సలహాదారు మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కాజీపేట పట్టణంలోని 47వ డివిజన్ డీజిల్ కాలనీ చౌరస్తా నందు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం పసునూరి మనోహర్ మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి మహబూబాబాద్ ఎమ్మెల్యేగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ప్రభుత్వ నిధులు తెచ్చి నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. అదేవిధంగా ఈరోజు కాంగ్రెస్ పార్టీలో ముఖ్య భూమిక పోషిస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ముఖ్య సలహాదారులుగా రాష్ట్రవ్యాప్తంగా బడుగు బలహీన వర్గాలకు కావలసిన ప్రణాళికలు సిద్ధం చేయుటలో ముందు వరుసలో ఉంటూ ఇందిరమ్మ ఇండ్ల పథకం విషయం గానీ, రైతులకు ఇచ్చే రుణమాఫీ విషయంలో గానీ, నిరుద్యోగ, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల విషయంలో గానీ, కామన్ ఇంట్రెస్ట్ ఎంట్రన్స్ టెస్ట్ విషయంలో గానీ ప్రభుత్వానికి అన్ని విధాల సహకరిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సలహాలు అందిస్తున్న వేం నరేందర్ రెడ్డి ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించాలని కాజీపేట పట్టణ ప్రజల పక్షాన మరియు 47వ డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలు పక్షాన ఆ భగవంతుని ప్రార్థిస్తున్నామని మనోహర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 47 వ డివిజన్ కార్యకర్తలు చందుపట్ల మాధవరెడ్డి, కంకణాల సురేందర్, రాజారపు యాదగిరి, కాంపెల్లి లక్ష్మణ్, బైరి సత్యం, తంగళ్ళపల్లి సమ్మయ్య , జవాజి నరేందర్, ధనరాజ్ , పొలిమేర గోపి, కందుకూరి ఎల్లయ్య , శ్రీనివాస్, మునిగాల ప్రసాద్, నాతరి శ్రీనివాస్, నదునూరి జానీ, వలబోజు రవీందర్, మోహన్, విజయ్, బొబ్బిలి రవి, షౌకత్ అలీ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




## గుంతల మయమైన రోడ్డుకు మరమ్మతులు చేయాలి

### మద్రిగూడెం ప్రాంతంలో రాస్తారోకో

ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ) ఖమ్మం–ఇల్లందు రూట్లో పాత లింగాల క్రాస్ రోడ్డు నుండి మద్రిగూడెం గ్రామ వరకు ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ వి రాకేష్ ప్రభుత్వాన్ని ఆర్అండ్బీ అధికారులను డిమాండ్ చేశారు. కామేపల్లి మండల పరిధిలో ఉన్న ప్రధాన రహదారి రోడ్డుకు మరమ్మతులు చేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఆధ్వర్యంలో గుంతల మయమైన మద్రిగూడెం ప్రాంతంలో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ ఖమ్మం- ఇల్లందు ప్రధాన రహదారి కామేపల్లి మండలంలో ఉన్న పండితపురం నుండి లింగాల మద్రిగూడెం తాళ్ల గూడెం కామేపల్లి క్రాస్ రోడ్డు వరకు రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణం నరకంగా మారుతోందన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారన్నారు.

రహదారి గుంతలతో మారడంతో ప్రతి రోజు వందలాదిగా నడిచే బస్సులు లారీలు ఆటోలు మొరాయిస్తూ మెకానిక్ల చుట్టూ తిరగాల్సివస్తోందన్నారు. ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు.పాత లింగాల క్రాస్ రోడ్ నుంచి మద్రిగూడెం గ్రామం ఊరు బయట వరకు మొత్తం ధ్వంసమై రాకపోకలకు అంతరాయ కలుగుతున్నా కనీసం తట్టెడు మట్టిపోసి బాగుచేసింది లేదన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేయలేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ మండలం నాయకులు చల్ల రాజు స్థానికులు రాయల వెంకన్న రాయల నాగేశ్వరరావు యజ్ఞేష్ మహేష్ ఉమేష్ పాల్గొన్నారు.



## పొంగులేటిని ఆహ్వానించిన సంఘ నాయకులు

ఖమ్మం ,డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ) ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ & మార్కర్స్ అసోసియేషన్ సంఘ నాయకులు మంత్రి క్యాంపు కార్యాలయానికి వెళ్లి కార్యాలయ ఇన్చార్జ్ తంబూరు దయాకర్ రెడ్డిని కలిసి ఈనెల 29వ తారీకు ఆదివారం వారి నూతన సంవత్సర 2025 డైరీ ఆవిష్కరణకు రావలసినదిగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని ఆహ్వానించడం జరిగింది. వెంటనే వారు సానుకూలంగా స్పందించినారు. క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకరరెడ్డి మంత్రి తప్పకుండా క్యాలెండర్ ఆవిష్కరణకు వస్తారు అని చెప్పిన వెంటనే సంఘ సభ్యులు వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘంప్రెసిడెంట్ నునావత్ కిషన్, జనరల్ సెక్రెటరీ జానీ, ట్రెజరర్ నవీన్ , మెంబెర్స్ భద్రం ,శ్రీను మరియు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం కక్ష పూరిత రాజకీయమే



### మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య

సత్తుపల్లి ఆర్సి, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ) తెలంగాణ ఉద్యమ కారుడు, ఉస్మానియా ఉద్యమ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ చేయడం కేవలం కక్ష పూరిత రాజకీయమేనని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిత్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వంకు వ్యతిరేకంగా అన్ని విషయాల్లో పోరాటం చేస్తూ ప్రజలతో పాటు దళిత గిరిజన సోదరులకు అండగా ఉంటున్నందుకు అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేశారని తెలుపుతూ,తెలంగాణ ఉద్యమ సమయంలోఎవరూ కూడా ఈ విధంగా కేసులు పెట్టలేదని గుర్తు చేశారు. కాబట్టి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష పూరిత చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం.. వెంటనే ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలనీ ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు.



## ఖమ్మం మార్కెట్‌లోకి బజాజ్ ఎలక్ట్రికల్ ఆటోలు విడుదల

ఖమ్మం, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ): ఆటో రంగంలో దిగ్గజ సంస్థ ఐన బజాజ్ డివిజన్ తమ త్రీ వీలర్ రంగంలో ప్యాసింజర్ మరియు కమర్షియల్ ఎలక్ట్రికల్ ఆటో లను తమ అధీకృత డీలర్ ఐన వెంకటరమణ ఆటోమొబైల్స్ ద్వారా ఖమ్మం మార్కెట్ లోకి ఈ రోజు విడుదల చేసారు. ఈ సందర్భంగా బజాజ్ డివిజన్ ఆర్ ఎం బాభి మాట్లాడుతూ 70 సంవత్సరాల సర్వీస్ ఉన్నబజాజ్ కస్టమర్ ల కొరకు ఎప్పటికప్పుడు కస్టమర్ ల ఆలోచనలకు తగ్గట్లు గమార్చుకుంటూ బజాజ్ డివిజన్ ఇప్పుడు 95% షేర్ కలిగి ఉంది అన్నారు. వెంకటరమణ ఆటోమొబైల్స్ వారు కస్టమర్ల సౌలభ్యం కొరకు ఈ డబల్ డెక్కర్ షోరూం అందుబాటులోకి తీసుకురావడం చాల ఆనందదాయకమని అని అన్నారు.




## ఉమ్మడి ఖమ్మం జిల్లా బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం

### మీడియా సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి గండి వీరేందర్ గౌడ్

ఖమ్మం జిల్లా డిసెంబర్ 26 వాయిస్ టుడే : తెలంగాణా రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల నాయకత్వాన్ని రాజ్యాధికారంలో ఈ వర్గపు ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచే దిశగా తెలంగాణ వ్యాప్తంగా పలు సదస్సులు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నది( 8 ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి పూర్తిస్థాయి కమిటీలను నియమించింది) ఈ కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీల ఏర్పాటు క్యాడర్ నిర్మాణం నాయకత్వ శిక్షణతో పాటు ప్రస్తుత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో క్యాడర్ నిర్మాణం చేపట్టనుంది. సీనియర్ బీసీ నాయకులు మాజీ ,ప్రస్తుత బీసీ వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మున్సిపాల్ కౌన్సిలర్లు, చైర్మన్లు, మరియు ఇతర ముఖ్య నాయకులు మరియు సామాజిక కార్యకర్తలు బీసీ ఉపాధ్యాయ, జర్నలిస్టు, అడ్వకేట్, మహిళా సంఘాలు కార్మిక ,విద్యార్థి సంఘాలు మరియు అన్ని బీసీ కుల సంఘాల పెద్దలు ఖమ్మం టౌన్ నందు శనివారం బిసి రాజ్యాధికార సమితి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశానికి బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక ఆధ్యక్షులు దాసు సురేష్ ముఖ్యఅతిథిగా, రాష్ట్ర కార్యదర్శి ముంజల రాజేందర్ గౌడ్, మరియు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు.కావున అన్ని ప్రధాన పార్టీలలోని బీసీ నాయకులు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా క్షేత్రస్థాయి బీసీ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం తేదీ 28/12/2024 శనివారం రోజున 10 గంటలకు స్థానిక పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక, ఖానాపురం హవేలీ, ఖమ్మం లో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమావేశ నిర్వహణ బండి నాగేశ్వరరావు గౌడ్, పోడకంటి రాంబాబు చారి, కొడుపు గంటి శ్రీధర్, పోతురాజు తిరుపతయ్య, పల్లెపు సోమరాజు, లింగన్న బోయిన లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత గడ్డపై వందేళ్ళ చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ

### ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి

### కూనంనేని పిలుపు

ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే ) ఈరోజు ఖమ్మం జిల్లా కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముందుగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మకు పూలమాలవేసి వేలాది మందితో ర్యాలీని ప్రారంభించారు అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద జెండా ఆవిష్కరణ చేసి అనంతరం భక్త రామదాసు కళాక్షేత్రంలో ముందుగా భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కామ్రేడ్స్ ను సన్మానించుకొని అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ భారత గడ్డపై వందేళ్ళ చరిత్ర కలిగిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, కార్మిక హక్కుల సాధనకై ప్రజా చైతన్య పోరాటాలకై కష్టం కలిగిన ప్రతి పేదవాడి గుండెచప్పుడు ఈ ఎర్రజెండా అలాంటి ఎర్రజెండా లేదన్న వారికి కమ్యూనిస్టులు లేరని అన్న వారికి కళ్ళు తెరుచుకొని ఒక్కసారి చూడమని చెప్తున్నా అధికారం ఉన్న లేకపోయినా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని ఈరోజు వందమందితో ఓ కార్యక్రమం చేయాలంటే వేలు, లక్షలు ఖర్చు పెట్టేటువంటి పార్టీలు ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా వేలాదిమందిని తరలించే శక్తి కలిగినటువంటి పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని కండంతరాలు దాటిన కనపడే ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, కానీ ప్రాంతం దాటితే కనపడిన పార్టీ నాయకుల మమ్మల్ని విమర్శించేది ఒక్కసారి ఆలోచించుకోండి అధికారం కోసమో ధనం కోసం పార్టీలు మారే వ్యక్తులం కాదు మేము గుర్తుపెట్టుకోండి , మేమే నిజంగా అధికారం కావాలనుకుంటే ఈరోజు ఎన్నో పదవులు అనుభవించే వాళ్ళం అని గుర్తు చేశారు ఈ సందర్భంగా ఇంతా కాలం పార్టీకి వెన్ను దన్నుగా ఉండి అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తకు, నాయకులకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మౌలానా, దండి సురేష్,జెమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, రామకృష్ణ,ఎస్ కె జానీ మియా, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి లతా దేవి, పోటు కళావతి, సీతామహాలక్ష్మి, సిద్ధినేని కరుణకుమార్, మద్దోజు శ్రావణ్ కుమార్, సిపిఐ మండల భద్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమానికి కట్టుదిట్టమైన చర్యలు

## భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సత్తుపల్లి ఆర్ సి , డిసెంబర్ 26 ( వాయిస్ టుడే): ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సంక్షేమానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం మంత్రి, ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి పెనుబల్లి మండల కేంద్రంలో ఎస్.డి.ఎఫ్. నిధులు 29 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన (105) మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు మొత్తం ఒక కోటి 5 లక్షల 12 వేల 180 రూపాయల విలువ గల చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందిరమ్మ ప్రభుత్వంలో పేద ప్రజల కోసం ఇచ్చిన హామీలతో పాటు ప్రజలకు ఉపయోగపడే ఇతర పనులను సైతం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ఆర్థికంగా నష్టం చేస్తూ భారీగా అప్పులు చేసినప్పటికీ సాకులు చెప్పకుండా ప్రాధాన్యత క్రమంలో కార్యక్రమాల అమలు చేస్తున్నామని అన్నారు.

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, రాష్ట్రంలోని 25 లక్షల పైగా రైతులకు 21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్ 500 రూపాయల బోనస్ ఇచ్చామని, పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు 40 శాతం, పిల్లల కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని అన్నారు. గతంలో 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రాంతంలో 25 లక్షల 30 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తే , గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇండ్ల పేరిట ప్రజల చిరకాల కోరికను విస్మరించారని అన్నారు. మన ఇందిరమ్మ రాజ్యంలో మొదటి సంవత్సరంలోనే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామని అన్నారు. పాలేరుతో సమానంగా సత్తుపల్లి నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేస్తానని అన్నారు. పేద రైతులకు ఉన్న భూమికి భరోసా కల్పించేందుకు భూభారతి- 2024 చట్టం తెచ్చుకున్నామని అన్నారు. రాబోయే రెండు, మూడు నెలల్లో భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు.

పెనుబల్లి లో మెయిన్ రోడ్ విస్తరణ, డ్రైయిన్ల నిర్మాణం సంబంధించి నిధులు మంజూరు చేస్తామని అన్నారు. మీ సేవా కేంద్రం మంజూరు చేస్తానని, పెనుబల్లి ప్రెస్ క్లబ్ కోసం ప్రతిపాదనలు అందించాలని, పెనుబల్లి గ్రామపంచాయతీని నగర పంచాయతీగా అందరి ఆమోదంతో చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపి రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు ఇల్లు అందించడం జరుగుతుందని అన్నారు. ఎమ్మెల్యే కోరిన విధంగా 33 ఊర్లకు కొంతమేర ఎంపీ నిధులతో, మరికొన్ని ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన నిధులతో చేసేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ, పేదల పక్షపాతిగా ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వం రాష్ట్రానికి అప్పులు ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందని అన్నారు. మన మండలానికి 105 కల్యాణ లక్ష్మి చెక్కులు మంజూరయ్యాయని, వీటి ద్వారా పేదలకు కోటి 5 లక్షల రూపాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు.

అనంతరం మంత్రి కల్లూరు మండలం పాయాపూర్ గ్రామంలో సి.ఆర్.ఆర్. నిధులు 2 కోట్లతో, తల్లాడ మండలం అంబేద్కర్ నగర్ లో 2 కోట్లతో చేపట్టిన బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్, కల్లూరు ఆర్డీఓ రాజేందర్, తహసీల్దార్లు, పంచాయతీ రాజ్ ఈ. ఈ. రాంకోటి, డి.ఈ. రాంబాబు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వేం నరేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

### వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### ప్రభుత్వంలో వేం నరేందర్ రెడ్డి కీలక పాత్ర

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సిఎం ప్రజా వ్యవహారాలు చూసే వేం నరేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా నగరంలోని మార్కెట్ రోడ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ ప్రభుత్వానికి మంచి సలహాలు సూచనలు చేస్తూ ప్రభుత్వాన్ని మరింత ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వేం నరేందర్ రెడ్డికి భగవంతుడు ఎల్లప్పుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకుడు దన్న సింగ్, ఎండి తాజ్,ఎండి చాంద్, జీడి రమేష్,పెద్దిగారి తిరుపతి,మూల జైపాల్, మిరాజ్, శేహెన్ష, షబానా మహమ్మద్, మాసుం ఖాన్, ఊరడి లత, ముల్కల కవిత, జ్యోతి రెడ్డి, అశ్రఫ్, బషీర్,ఎల్లారెడ్డి,సుదర్శన్ పాల్గొన్నారు.



## కరీంనగర్‌లో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్ఫోర్స్ " డా.వి.నరేందర్ రెడ్డి

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26(వాయిస్ టుడే)పట్టభద్రులకు అన్ని విధాలుగా చేయూతనిస్తానని మరియు వారి అభ్యున్నతే నా ప్రధాన ధ్యేయమని ఉమ్మడి మెదక్ - నిజామాబాద్ ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి "అల్ఫోర్స్" డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించినటువంటి పలు ముఖాముఖి కార్యక్రమాలలో పాల్గొని వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల అభివృద్ధికై అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానని వారి కావలసిన వనరులు కల్పించడానికి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అభివృద్ధి పథాన పయనించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పర్యటనలో భాగంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రవేట్ వేడుక మందిరంలో పట్టభద్రులతో ముఖాముఖి నిర్వహించి వారిని ఉద్దేశించి మాట్లాడారు. సమాజంలో పట్టభద్రులను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని నిరుద్యోగ నిర్మూలన కై ప్రత్యేక ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తానని తద్వారా వారికి జీవనోపాధి కల్పించడమే కాకుండా సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని వారు చెప్పారు.

అదేవిధంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అందరికీ ఆరోగ్య భీమా వర్తించేందుకు కృషి చేస్తానని మరియు వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఉద్యోగులకు వర్తిస్తున్న వివిధ పథకాలను వారికి కూడా అమలుపరిచేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశాలలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు పట్టభద్రులందరూ నరేందర్ రెడ్డి మద్దతు ఇస్తామని వారిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని ప్రకటించారు.



## ఆర్ కృష్ణయ్య సన్మానించిన బీసీ జేఏసీ నాయకులు

కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26(వాయిస్ టుడే)బీసీల ఉద్యమకారుడు జాతీయ హోదా కలిగిన ఏకగ్రీవంగా రాజ్యసభ హోదా తో మొదటిసారిగా హైదరాబాద్ కు విచ్చేసినటువంటి ఆర్ కృష్ణయ్య చేసి కెశిపెద్ది శ్రీధర్ రాజు , రాచమల్ల రాజిరెడ్డి, దొగ్గలి శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క శాలువాతో సన్మానించడం జరిగింది.. అనంతరం వారితో బిసి కుల గణన, మహిళలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ , రిజర్వేషన్లపై చర్చించి రాజ్యసభలో ఆమోదం అయ్యేటట్లు చూడాలని వారికి విజ్ఞప్తి చేశారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ సోషల్ సర్వీస్

### జాతీయస్థాయి అవార్డుకు ఎండి ఇబ్రహీం ఎంపిక..!



పెద్దపల్లి జిల్లా: డిసెంబర్.26 (వాయిస్ టుడే) గోదావరిఖని: అంబేద్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు కు ఇన్కమ్ టాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం ఎంపిక. జనగామ గ్రామానికి చెందిన ఇన్కమ్ టాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం జాతీయస్థాయి అవార్డు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్సలెన్సీ అవార్డు కు ఎంపికైనట్లు అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ మనీష్ గవాయి మరియు ప్రియాంక సాతే తెలిపారు జనవరి 3 -2025 తేదీన క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకల సందర్భంగా అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ మరియు ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీ లోని న్యూ మహారాష్ట్ర సదన్ లో నిర్వహించు కార్యక్రమంలో ఈ అవార్డును ముఖ్య అతిధులు కేంద్ర సామాజిక సాధికారిక శాఖ మంత్రి రాందాస్ హత్వాలే నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా నేషనల్ ఉమెన్ కమిషన్ చైర్మన్ విజయ కె .రహత్కర్ చేతుల మీదుగా అవార్డు ప్రధానం చేయబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇబ్రహీం గత కొంతకాలంగా సామాజిక సేవ చైతన్య కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు పర్సనాలిటీ డెవలప్మెంట్ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనర్ గా యువతీ యువకులకు ట్రైనింగ్ ఇచ్చి ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలలో ఉపాధి కల్పించడానికి దోహదపడినారు జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల పలువురు ఎండి ఇబ్రహీంను అభినందించారు.



## పాల ఉత్పత్తిదారుని కూతురు వివాహానికి పుస్తె మెట్టెల పంపిణీ

చిగురుమామిడి (వాయిస్ టుడే): చిగురుమామిడి మండల పరిధిలోని గాగిరెడ్డిపల్లి అమ్లెట్ గ్రామం మౌటంపల్లికి చెందిన గుడిపల్లి రాజు కూతురు వివాహానికి కరీంనగర్ డెయిరీ వారి సుందరగిరి పాల ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో డెయిరీ చైర్మన్ పిట్టల తిరుపతి పుస్తె మట్టెలు గురువారం పెళ్లికూతురు తండ్రికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తి దారుల డైరెక్టర్లు గండికోట చిన్న శ్రీనివాస్, బట్టు మల్లయ్య, శ్రీమూర్తి శ్రీనివాస్, పెసరు శ్రీనివాస్, పి. రమేష్, గందె రాజు, తాళ్లపల్లి సంపత్, కాశ బోయిన రమేష్, ఎనగందుల శారద, కార్యదర్శి మెడబోయిన శ్రీనివాస్, వెంకటేష్, గంగరాజు, రాజ్ కుమార్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రక్కదారి పడుతున్న రాయితీ గ్యాస్ పట్టించుకోని అధికారులు

### ఏటా దాదాపు 250 కోట్ల రూపాయల గ్యాస్ రాయితీ పక్కదారి

కరీంనగర్, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యరేంటిల్లో సామాన్య గృహిణికి చేయుతగా రాయితీ వంట గ్యాస్ అందిస్తున్నారు. కానీ దీనిని ఆసరగా చేసుకుని అక్రమార్కులు రాయితీ వంట గ్యాస్ పక్క దారి పట్టిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వాయిస్ టుడే ప్రతినిధులు నిర్వహించిన తనిఖీల్లో చిన్నా చితక హెూటళ్లలో రోజుకు దాదాపు 500




రాయితీ సిలిండర్ లు దర్జాగా వాడేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తుంది.రోడ్డు పైనే రాయితీ సిలిండర్లు పెట్టి యదేచ్ఛగా వాడుతున్నా కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా రోజుకు సుమారు 500 సిలిండర్లు వాడిన నెలకు 55 లక్షల రూపాయలు ప్రభుత్వ రాయితీ సొమ్ము పక్కదారి పడుతుంది. ఇలా చూస్తే సంవత్సరానికి ఒక్క కరీంనగర్ జిల్లాలోని సుమారు 7 కోట్ల రూపాయల ప్రజాధనం అసమర్థ అధికారుల వల్ల ప్రక్కదారిన పడుతుంది . ఇలా చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా 250 కోట్ల ప్రజాధనం పక్క దారిన పడుతున్నా అధికారులు కానీ, రాజకీయ నాయకులు కానీ పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తుంది. అప్పుడప్పుడు అధికారులు చిన్న చితక హెూటళ్లలో తనిఖీలు నిర్వహించి జరిమానా విడిస్తున్నారే తప్ప రాయితీ గ్యాస్ సిలిండర్ లు పక్కదారి పట్టకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని రాయితీ వంట గ్యాస్ పక్క దారి పట్టకుండా పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలి అని ప్రజలు కోరుతున్నారు.

## ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా వాసి అలివేలి రాజు



కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26(వాయిస్ టుడే)సిద్దిపేట లో జరిగిన అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 43 రాష్ట్ర మహాసభల్లో కరీంనగర్ జిల్లా శంకరపట్నం కు చెందిన అలివేలి రాజు ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు . ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి 2025 సంవత్సరానికి గాను ఇట్టి మహాసభలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉస్మానియ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి నాయకుడు అలివేలి రాజు కి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా నియమితులు కావడం పట్ల కరీంనగర్ జిల్లా ఏబీవీపీ శ్రేణులు తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన అలివేలి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాల పై ,విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తగిన కార్యాచరణతో ఉద్యమాలు చేపడతామన్నారు. నాపై నమ్మకంతో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాధ్యతను అప్పగించినందుకు రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఏబీవీపీ రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఏబీవీపీ బలోపేతానికి శాయ శక్తుల తగిన కృషి చేస్తానని తెలిపారు.

# నేత్రదాత కుటుంబానికి అభినందన పత్రం



పెద్దపల్లి జిల్లా: డిసెంబర్. 26 (వాయిస్ టుడే) గోదావరిఖని: నేత్రదానం.మహా పుణ్యకార్యం. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత బూర సదానందసంస్మరణ సభ కుటుంబ సభ్యులకు అభినందన ఉంచారు. నేత్రదానం మహా పుణ్యకార్యమని సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు.భీష్మాచారి అన్నారు. ఓదెల మండల కేంద్రానికి చెందిన బూర సదానంద ఇటీవల మృతి చెందగా, సదాశయ ఫౌండేషన్, ఆధ్వర్యంలో ఆతనినేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాధించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఈరోజు వారి స్వగృహంలో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ, శరీర దానంపై మేర్గు. భీష్మాచారి అవగాహన కల్పించారు. నేత్రదాత తల్లి మధురమ్మ కూతుళ్లు ఆమిదాల రమేష్ రాజేశ్వరి, కి,శే,సింగని లక్ష్మీరాజం-కళావతి, కుడికాల.కుమార్- స్వరూప. మనుమలు ఆమిదాల కిషన్ సింగనీ సాయికిరణ్ .శివ మరియు,మనమరాడ్లు లను అభినందించి, (భారత్ గ్యాస్) సత్యనారాయణ చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందజేశారు. గ్రామస్తులు కుల బంధువులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు . సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ గౌరవ సలహాదారు నూకా రమేష్. కె.ఎస్.వాసు. ప్రధాన కార్యదర్శిలింగమూర్తి మండలఇంచార్జ్ క్యాతం.మల్లేశం మెరుగు.సారంగం,బైరి.వినోద్.మెరుగు.మల్లేశం. సదానందం. తదితరులు అభినందించారు.



## పోరాటాల పార్టీ సిపిఐ ఆవిర్భవించి వందేళ్లు

**సమ సమాజ నిర్మాణం కోసం అనేక పోరాటాలు ఉద్యమాలు**

**మావోయిస్టు పార్టీతో సహా దేశంలోని కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకం కావాలి**

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

భీమదేవరపల్లి వాయిస్ టుడే డిసెంబర్ 26: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో సిపిఐ పార్టీ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఐరాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు సీపీఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమసమాజ నిర్మాణం కోసం సిపిఐ అనేక పోరాటాలు ఉద్యమాలు చేసిందని అన్నారు దున్నేవాడికి భూమి కావాలని పరిశ్రమలు బ్యాంకులో ప్రభుత్వ రంగంలో ఉంటేనే పేద మధ్యతరగతికి కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు పరిశ్రమలు ప్రైవేటు చేతుల్లో ఉంటే కార్పొరేట్లకు ఊడిగం, రిజర్వేషన్లు అమలు కావన్నారు పేదవానికి నాణ్యమైన విద్య అందడం లేదని డబ్బుంటేనే నాణ్యమైన విద్య అనే పరిస్థితి ఉందన్నారు కమ్యూనిస్టులు ఐక్యం కావాలని మావోయిస్టు పార్టీతో సహా అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు అప్పుడే పేద మధ్యతరగతి వారికి మంచి రోజులు వస్తాయన్నారు ప్రపంచం కమ్యూనిజం వైపు చూస్తుందని దేశంలో కమ్యూనిస్టులు ఏకమై కష్టజీవుల మంచి కోసం పేదవాడి రాజ్యం కోసం కలిసి పోరాడాలని అన్నారు పెట్టుబడిదారీ పార్టీలు బిజెపి కాంగ్రెస్ పేదల బాగు పట్టించుకోని కమ్యూనిస్టులు మాత్రమే పేదల పక్షాన పోరాటం చేస్తారని అన్నారు. యువతకు ఉద్యోగాలు 8 గంటల పని దినాలు కనీస వేతనాలు ప్రజల హక్కుల కోసం పోరాటాలు ఉద్యమాలు బలిదానాలు చేసిన పార్టీ సిపిఐ అని అన్నారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రి భిక్షపతి నాయకులు జుర్రు సంపత్ ఆదరి రమేష్ కొంగల రామచంద్రారెడ్డి మార్పు సంజీవరెడ్డి కృష్ణారెడ్డి బోడ బాలరాజు తిరుపతి ఉప్పలయ్య స్వరూప రంజిత్ మద్ది శీను అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు బోయినపల్లి యువకుడు




వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి డిసెంబర్ 26: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ కబడ్డీ లో బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు మామిడాల నీరజ్ ఎంపిక అయినట్లు డి వై ఎస్ ఓ అజ్మీరా రాందాస్ తెలిపారు. ఈ నెల 27 నుండి 31 వరకు మహబూబ్ నగర్ లో జరిగే రాష్ట్ర స్థాయి సి ఏం కప్ కబడ్డీ విభాగం లో నిరజ్ పాల్గొంటాడు అని డి వై ఎస్ ఓ తెలిపారు. నిరజ్ సెలెక్ట్ కావడం పట్ల గ్రామంలో సీనియర్ క్రీడాకారులు మరియు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసారు.

## నిత్యాన్నదానానికి సీల్డ్ ప్లేట్స్ వితరణ



కరీంనగర్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 26(వాయిస్ టుడే)కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదం వితరణ జరుగుతుంది. వెంగల్ దాస్ అర్చన -శ్రీనివాస్, పెళ్లి రోజు సందర్భంగా బొమ్మకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 5000 రూపాయల విలువ గల 100 స్టీల్ ప్లేట్స్ మీల్స్ ఆన్ వీల్స్ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ చింతల కిషన్ పటేల్, క్లబ్ అధ్యక్షుడు కాంరెడ్డి నరసింహారెడ్డి, సెక్రెటరీ బట్టు రాజేందర్, మాసినేని చక్రధర్, రవి కంటి కృష్ణ కిషోర్, అరికొంతం రవీందర్ రెడ్డి, జీవీ లక్ష్మీనారాయణ, మల్లికార్జున రాజేందర్, బూర్ల విద్యాసాగర్, అంబాటి రవీందర్ రాజు, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారుద.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి డిసెంబర్ 26 : బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నల్ల మోహన్ కొడుకు నల్ల అనిల్ రిసెప్షన్ కార్యక్రమానికి గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై నూతన వధూవరులు నల్ల అనిల్ కళ్యాణి లను ఆశీర్వదించారు. ఆయన వెంట ఏఎంసి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఉపేందర్, ఏఎంసి డైరెక్టర్ గుడి రాజశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బోలుమాల శంకర్, నాయకులు పిట్టల రమేష్, గుంటి జలంధర్, శ్రీకాంత్, నక్క ప్రశాంత్,పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు.

# మహోజ్వల పోరాటాల, త్యాగాల చరిత్ర కలిగి 100 సంవత్సరాల ఏకైక రాజకీయ పార్టీ సీపీఐ

### సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి




కరీంనగర్, డిసెంబర్ 26 ( వాయిస్ టుడే): భారతదేశ గడ్డపై మహెూజ్వల పోరాటాల, త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)100వ ఆవిర్భావ దినోత్సవ వారిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా సిపిఐ జెండాలు ఎగురవేసి,ర్యాలీలు నిర్వహించి ఘనంగా వేడుకలు జరిగినట్లు వెంకటస్వామి తెలిపారు. కరీంనగర్ లోని గీతా భవన్ చౌరస్తా నుండి వాలంటీర్లతో ర్యాలీగా బయలుదేరి బస్టాండ్ , కూరగాయల మార్కెట్ , రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా,కమాన్ చౌరస్తా మీదుగా సిపిఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం జిల్లా కార్యాలయం పై సిపిఐ పతాకాన్ని మర్రి వెంకటస్వామి ఎగురవేశారు. 100 సంవత్సరాల వేడుకల సందర్భంగా సుదీర్ఘ కాలం సీపీఐ లో పనిచేస్తూ అనేక ప్రజా సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి నేటికీ సిపిఐ లో క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండి ఎందరికో ఆదర్శంగా నిలిచిన సీనియర్ నాయకులను, మర్రి వెంకటస్వామి జిల్లా పార్టీ నాయకత్వం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని పోరాటాలు జరుగుతున్న క్రమంలో 1925 డిసెంబర్ 26 న ఉత్తర ప్రదేశ్ లోని కాన్పూర్ లో సిపిఐ ఆవిర్భవించిందని, దేశంలో దోపిడీ లేని,అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా కార్మిక,కర్షక, ప్రజా దోపిడీకి పాల్పడుతున్న వర్గాలకు వ్యతిరేకంగా మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ నిరంతరం అన్ని రంగాల కార్మిక శ్రేయస్సు కోసం ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించిన పార్టీ సిపిఐ అని, వేలాదిమంది అమరవీరుల త్యాగాల ఫలితంగా నేటికీ సిపిఐ మనుగడ కొనసాగుతుందని, దేశంలో 530కి పైగా ఉన్న సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయాలని పోరాటాలు నిర్వహించిందని, వర్గ దోపిడీకి పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పరిగెట్టించే పార్టీ సిపిఐ అని అన్నారు. భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కార్మికులకు అన్ని వర్గాల ప్రజలకు,భారత రాజ్యాంగానికి లోబడి పౌరులకు హక్కులు కావాలని, భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ విముక్తి కోసం దేశ పాలకులపై అనేక పోరాటాలు నిర్వహించిన పార్టీ సిపిఐ అని, దేశంలో రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, భూ సంస్కరణలు చట్టం లాంటి అనేక ప్రజలకు ఉపయోగపడే విధంగా సిపిఐ పోరాటాలు నిర్వహించి సాధించిన విజయాలుగా చెప్పవచ్చని, దేశంలో ఉన్న ప్రజానీకం స్వేచ్ఛగా తమ హక్కుల కోసం ప్రశ్నించే తత్వాన్ని కలిగించినది ఎర్రజెండానే. దేశంలో 100 సంవత్సరాలు నిండిన ఏకైక పార్టీ సిపిఐ అని,కాంగ్రెస్ పార్టీ కూడా అది ఇందిరా కాంగ్రెస్ అని, దేశంలో ఒకపక్క లెఫ్ట్ స్ట్ మరో ప్రక్క రైటిస్ట్ మతోన్మాదంతో హిందూయిజాన్ని అడ్డం పెట్టుకొని రెచ్చగొట్టే విధంగా ఉండే ఆర్ఎస్ఎస్ ఒక్కటే 1925లో ఆవిర్భవించిందని వెంకటస్వామి అన్నారు. 1925లో ఆవిర్భవించిన సిపిఐ 2025 నాటికి 100 సంవత్సరాలు పూర్తి అవుతాయని నేటి నుండి సంవత్సరం పాటు సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహించుకుంటామని, 100 సంవత్సరాల ఉద్యమాలను, పోరాటాలను విజయాలను ప్రజలకు వివరిస్తూ మరింత పట్టుదలతో సిపిఐ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తూ ముందుకు వెళతామని వెంకటస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, పంజాల శ్రీనివాస్ నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, బ్రామాండ్లపెల్లి యుగేందర్, బూడిద సదాశివ, బోనగిరి మహేందర్, న్యాలపట్ల రాజు,బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, గొడిశీల తిరుపతి గౌడ్, మచ్చ రమేష్, రామారపు వెంకటేష్, లంకదాసరి కళ్యాణ్,గోవిందుల రవి, నాయకులు మురళీ, సంపత్,అంజలి, రమ, హేమంత్, సాగర్, రాము, విష్ణు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలను ఆదుకుంటాం: షబ్బీర్ అలీ

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 26: భిక్కనూరు ఎస్సై సాయికుమార్ సహా కానిస్టేబుల్ శ్రుతి, కంప్యూటర్ ఆపరేటర్ నిఖిల్ మృతి చెందడం బాధాకరమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. వారి కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకునేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో గురువారం మృతుల కుటుంబాలను షబ్బీర్ అలీ పరామర్శించారు. పోలీసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిఖిల్ తల్లికి షబ్బీర్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎస్సై సాయికుమార్ కు మంచి పేరుందన్నారు. ఎస్సై భార్యతో పాటు శ్రుతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. పోలీసుల విచారణ అనంతరం నిఖిల్ కుటుంబానికి న్యాయం చేస్తామని వెల్లడించారు.

## బాయ్స్ డ్రెస్సెస్ నూతన ప్రారంభోత్సవం



కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 26: గురువారం కామారెడ్డి పట్టణంలోని కేంద్రంలోని ధర్మశాల ప్రభుత్వ పాఠశాల దగ్గర్లో నూతనంగా ఏర్పడిన మన ఫన్నీ బాయ్స్ డ్రెస్సెస్ నూతన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గడ్డం ఇందు ప్రియ చంద్రశేఖర్ రెడ్డి.

## పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మండలం సైదాపురం అంజనాపురి కాలనీలో రూ.70 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని, గోదామును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. యాదగిరిగుట్ట మండల పీ ఏ సీ ఎస్ ఛైర్మన్ ఇమ్మడి రాంరెడ్డిగారు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,ఎంపీ చామలకు ఘనంగా స్వాగతం పలికి శాలువా తో సన్మానించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలో 120 చెరువులను నింపినామని అన్నారు, ప్రజా ప్రభుత్వంలో రైతులకు 54 వేల కోట్ల లబ్ది జరిగిందని, సంక్రాంతి నుండి రైతు భరోసా వస్తుందన్నారు, సన్న వడ్లకు బోనస్ రైతులకు ఎకరానికి 12 లబ్ధి చేకూరిందని,వ్యవసాయ యాంత్రికరణ పథకం పునరుద్ధరణ చేయడం జరిగింది అన్నారు. 15 రోజుల్లో 21 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ,వానకాలం సీజన్లో 8.84 లక్షల మంది రైతులు నుంచి 10.903 కోట్ల ధాన్యం కొనుగోలు చేసామన్నారు.సన్న వడ్లు 18, 78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం 939 కోట్ల బోనస్ అందిందని అన్నారు.

# మండలంలో ఘనంగా సిపిఐ పార్టీ శతజయంతి ఉత్సవాలు

### మండల కేంద్రంతో పాటు ఇందుర్తి, ఓగులాపూర్‌లో పెద్ద ఎత్తున వేడుకలు



చిగురుమామిడి (వాయిస్ టుడే): పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని సిపిఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పిటిసి, రాష్ట్ర నాయకులు అందే స్వామి తెలిపారు. గురువారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంతో పాటు ఇందుర్తి, లంబాడిపల్లె, ఓగులాపూర్ తదితర గ్రామాల్లో సిపిఐ పార్టీ వంద సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జెండాలను ఎగురవేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక కర్షక ప్రజా శ్రేయస్సుకోసం సమాజ స్థాపన కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ కాన్పూర్ లో ఆవిర్భవించిందని, 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరంలోకి అడుగు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు కాంగ్రెస్, సిపిఐ పార్టీలు అన్నారు. సిపిఐ పార్టీ పేదలకు భూమి కోసం, భుక్తి కోసం, బానిస బతుకుల విముక్తి కోసం అనేక పోరాటాలు చేసి ఎంతో మంది పేద ప్రజలకు భూములు పంచిన చరిత్ర సిపిఐది అని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం కూడా సిపిఐ కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమాలు చేసిన పార్టీ అన్నారు. తెలంగాణ స్వరాష్ట్రం కోసం అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐ పార్టీకి ఉందన్నారు. పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు స్వీట్లు పంపిణీ చేసి కేక్ కట్ చేసి, పార్టీకి అహర్నిశలు కృషి చేసి వృద్ధాప్యంలో ఉన్న వారినకి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ, సింగిల్ విండో డైరెక్టర్ ముద్రకొల రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతల శ్రీనివాస్ రెడ్డి, ఇల్లెందుల నాయకులు గూడెం లక్ష్మి,అందే చిన్నస్వామి, గడ్డం రాంరెడ్డి, కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, ఉస్మాన్ పాషా, బోయిని మొండయ్య, ముస్కు మాధవరెడ్డి, బూడిద కుమార్, కయ్యం వీరయ్య, గట్టు మొగిలి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శిగా కానకుంట గోవర్ధన్

కామారెడ్డి వాయిస్ టుడే డిసెంబర్ 26: నా మీద నమ్మకంతో జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆదేశాల మేరకు ఓబీసీ మోర్చా పట్టణ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కానకుంట గోవర్ధన్ విరికి నియామక పత్రం అందచేసిన ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెర్క వెంకటేష్ జిల్లా అధ్యక్షులు తోట బాలరాజ్ టౌన్ అధ్యక్షులు ఉప్పు లక్ష్మీపతి మరియు కార్యవర్గ సభ్యులు బస్వాలింగం శరత్ తదితరులు పాల్గొన్నారు నా మీద నమ్మకంతో ఈ బాధ్యత నాకు ఇచ్చినందుకు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు



## కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య

చేవెళ్ల..డిసెంబర్ 26(వాయిస్ టుడే)శంకర్ పల్లి మండలం కొండకల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య. ఈ సందర్భంగా కొండకల్ గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యే కాలే యాదయ్యకు ఘన స్వాగతం పలికి, ర్యాలిని నిర్వహించారు. గ్రామంలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ మరియు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొండకల్ గ్రామానికి చెందిన10 మంది కార్యకర్తలు BRS పార్టీ నుండి ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి , ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ వాటర్ ట్యాంక్ రిపేర్ల నిమిత్తం విడుదల నిధులుతో పనులు ప్రారంభించిన జువ్వాడి నర్సింగ్ రావు

వాయిస్ టుడే ప్రతినిధి మల్లాపూర్ డిసెంబర్ 26: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం నడిగూడ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు ఎస్ డి ఎఫ్ నుండి నిధులు మంజూరు చేపించి ఈ రోజు ప్రొసీడింగ్ కాపీ అందజేసిన జువ్వాడి అనంతరం జీరో అండ్ ఎం మిషన్ భగీరథ నుండి గ్రామ వాటర్ ట్యాంక్ రిపేర్ల నిమిత్తం విడుదల నిధులుతో పనులు ప్రారంభించిన కోరుట్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సీతారామచంద్రస్వామి నీ దర్శించుకున్న ఎం.ఎన్.జే క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ ముక్తా శ్రీనివాసులు

భద్రాచలం, డిసెంబర్ 26 ( వాయిస్ టు డే) హైదరాబాద్ లకిడికాపూల్, రెడ్ హిల్స్‌లోనీ ప్రఖ్యాత (ఎం.ఎన్.జే) మెహది నవాబ్ జంగ్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్, ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ ముక్తా శ్రీనివాసులు శ్రీ సీతారామచంద్రస్వామి నీ దర్శించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో గురువారం భద్రాచలం లో విచ్చేసి రాముల వారిని దర్శించుకున్నారు. రామాలయం గర్భ గుడిలో అభిషేకం, అర్చన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం జరిగిన నిత్యకళ్యాణం లో పాల్గొని వేద ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం పర్ణశాల రామలయాన్ని సందర్శించారు. వీరి వెంట వారి సతీమణి డాక్టర్ సిహెచ్ భవాని (సీనియర్ గైనాకలాజిస్ట్, ఆద్య నర్సింగ్ హోమ్, హిమాయత్ నగర్), డి. శివకుమార్, అరుణ, నాగలక్ష్మి, అనసూయ, అవినాష్ ఉన్నారు.

# వెనకబడిన ప్రాంతాల నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలి

### కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్




మక్తల్ డిసెంబర్ 26 వాయిస్ టుడే ప్రతినిధి: మారుమూల వెనకబడిన ప్రాంతాల నిరుపేదల అభ్యున్నతికి అధికారులు చిత్త శుద్ధితో కృషి చేయాలని, 2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడో స్థానంలో ఉండే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా పర్యటన లో భాగంగా నర్వ మండలం రాయికోడ్ గ్రామంలో లో కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ కు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ శాలం, ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల పూల మొక్కలు అందజేసి సాదర స్వాగతం పలికారు.

అనంతరం కేంద్ర హోం వ్యవహారాల శాఖ సహాయ మంత్రి, బండి సంజయ్ కుమార్ పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఆయన అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్ వాడీ పిల్లలను ఊరి పేరు, మండలం, జిల్లా పేరు అడిగి వారితో జవాబు రాబట్టారు. సెంటర్ లో ఎంత మంది పిల్లలు ఉన్నారని,అందులో శ్యాం మ్యాం పిల్లలు ఎంతమంది అని టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆట వస్తువులను చూశారు. పిల్లలికి ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని టీచర్ ను అడగడంతో ఫర్నీచర్ అవసరమని, నీటి సమస్య ఉందని టీచర్ తెలిపారు. అధికారులకు చెప్పి ఫర్నీచర్ ను సమకూర్చుతానని, నీటి సమస్యను పరిష్కారింప చేస్తామని ఆయన చెప్పారు. వంటగది శుభ్రంగా ఉందని మెచ్చుకున్నారు. గర్భిణీలకు అందించే ఆహారం ఎలా ఉంటుందని ఆరా తీశారు. అక్కడే ఉన్న ఐదుగురు గర్భిణీలకు శ్రీమంతంలో భాగంగా పండ్లు, పసుపు, కుంకుమ, గాజుల కిట్టును అందజేశారు. ఇద్దరు చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. కిచెన్ గార్డెన్ లో ఏ ఏ కూరగాయలు పండిస్తారని అడిగారు. పూల మొక్కలను నాటారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందిస్తారని, రోజుకు ఎంతమంది రోగులు వస్తారని, ఎమర్జెన్సీ పెసెంట్లను ఎక్కడికీ రెఫర్ చేస్తారని అడిగి తెలుసుకున్నారు. మందులన్ని అందుబాటులో ఉన్నాయా? అన్ని రికార్డులు సక్రమంగా రాస్తున్నారా లేదా ? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎమర్జెన్సీ రోగులను 108 వాహనంలో మక్తల్, జిల్లా ఆసుపత్రికి తరలిస్తామని, రోజుకు 20 మంది దాకా రోగులు వస్తారని, అవసరమైన మదులన్ని ఉన్నాయని వైద్యుడు మంత్రికి తెలిపారు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జిల్లాకు నవోదయ పాఠశాలను మంజూరు చేయాలని మంత్రి బండి సంజయ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. అక్కడే ఉన్న ఓ దివ్యాంగుడు కూడా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. చివరగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్ళి అక్కడ విద్యార్థులు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్నీ పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని? రోజూ మధ్యాహ్న భోజన ఇలాగే పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో వంటగదిని నిర్మింప చేసి,గ్యాస్ స్టవ్ ను ప్రొవైడ్ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలోనే మీడియాతో మాట్లాడారు. వెనక బడిన ప్రాంతాలను కేంద్రం గుర్తించి వాటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని దేశవ్యాప్తంగా 112 జిల్లాలలో 500 బ్లాక్ ల మండలాలలో సంపూర్ణత అభియాన్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజల బాగోగులు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన జిల్లాలలోని గ్రామాల్లో కేంద్ర మంత్రులు పర్యటించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్నాయా లేదని పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. అభివృద్ధి చెందిన మండలాలకు దీటుగా ఆయా గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో భూపాలపల్లి, ములుగు నారాయణపేట జిల్లాలలో 10 ఆస్పిరేషన్ బ్లాక్ లు ఉన్నాయన్నారు. గురువారం సాయంత్రం కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా, శుక్రవారం రాయచూర్, గద్వాల జోగులాంబ జిల్లాలో పర్యటిస్తున్నట్లు మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. నీతి అయోగ్ ద్వారా సంపూర్ణత అభియాన్ నడుస్తుందని తెలిపారు. రాయికోడ్ గ్రామంలో అంగన్వాడి పిల్లలు, గర్భిణీలు, పాఠశాల విద్యార్థుల తో మాట్లాడడం జరిగిందని ఏమైనా సమస్యలు ఉన్నాయా ? లేదా అని తెలుసుకోవడం జరిగిందన్నారు. 2028 సంవత్సరం నాటికి ఆర్థిక ప్రగతిలో భారత్ మూడవ స్థానంలో ఉండే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.



## మక్తల్ ను రెవిన్యూ డివిజన్ చేయాలి

మక్తల్ డిసెంబర్ 26 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ ను రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలని మక్తల్ అఖిలపక్ష అద్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ గారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ శ్రీ డా వాకిటి శ్రీహరి , బీజేపీ నేత బి.కొండయ్య, అఖిల పక్ష నేతలు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా గౌరవ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మక్తల్ కు అన్ని రకాల వనరులు పుష్కలంగా ఉన్న సందర్భంలో మక్తల్ ను రెవెన్యూ డివిజన్ అంశంలో ప్రభుత్వానికీ సానుకూలంగా నివేదిక పంపాలని అఖిల పక్షం అధ్వర్యంలో ఎమ్మెల్యే కోరారు.



## వృద్ధుడు పెంటయ్య 20 యేళ్ల కళను నెరవేర్చిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో ఆశ్రయం కల్పించిన వృద్ధుడు భిక్షాటన చేస్తున్న పెంటయ్యకు గురువారం ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సమక్షంలో వారి ఆదేశాల మేరకు యాదగిరిగుట్టలో తలనీలాలు సమర్పించి పునర్జన్మ కల్పించడం జరిగింది.అనంతరం శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి వారి దివ్యదర్శనం ఆ పెంటయ్య కు కల్పించడం జరిగింది. వివరాల్లోకి వెళ్తే చాలా ఏళ్లుగా హైదరాబాద్ లో భిక్షాటన చేస్తూ అలా వెంట్రుకలు పెంచుకొని అందవికారంగా ఉన్న పెంటయ్య అనే వ్యక్తి హైదరాబాద్ లో తిరుగుతుండగా మాతృ దేవోభవ అనాథ ఆశ్రమం గిరి హక్కునా చేర్చుకున్నారు.ఈ సందర్భంగా పెంటయ్య కోరిక తీర్చలని ఓ వీడియో చేయగా దాని చూసి చెల్లించి పోయిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గురువారం ఉదయం అతనికి దర్శన భాగ్యం కల్పించి ఆయన కోరికను తీర్చారు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య.ఈ సందర్భంగా మాతృదేవో భవ అనాథ ఆశ్రరం గిరి గారు మాట్లాడుతూ ఇంత గొప్ప అవకాశం కల్పించిన బీర్ల అయిలయ్య కి, మరియు ఆలయ అధికారులకు మాతృదేవోభవ అనాథ ఆశ్రమం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## జాతీయ మహాసభలకు ఆర్థిక చేయూత ఇవ్వండి

### ఏఐటియుసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య




రామకృష్ణాపూర్ డిసెంబర్ 26 (వాయిస్ టుడే): హైదరాబాద్ లోజనవరి 5,6,7 తేదీలలో అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం (ఏఐడీ ఆర్ఎం) ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ రెండవ మహాసభలకు దేశవ్యాప్తంగా వెయ్యి మంది ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ మహాసభలు విజయవంతం చేసేందుకు డి.హెచ్.పి.ఎస్ నాయకులు విరాళాలు సేకరిస్తున్నారని వ్యాపార వర్గాలు, కార్మికులు ప్రజలు ఆర్థికచేయుతను అందించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. గురువారం జాతీయ రెండవ మహాసభల నిర్వహణ కొరకు డి.హెచ్.పి.ఎస్ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్యను తన నివాసంలో కలిసి విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులకు ఆర్థిక, రాజకీయ,సామాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కుల వివక్షత, కుల నిర్మూలన కోసం ఎస్సీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని దళితుల అభివృద్ధి కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా ఆందోళనలు పోరాటాలు నిర్వహించుటకు భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకొని దేశవ్యాప్తంగా నిర్మాణ ప్రతిష్టను పెంపొందించడానికి అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం ఏఐడిఆర్ఎం ఆధ్వర్యంలో హైదరాబాదులో జరిగే రెండవ జాతీయ మహాసభలకు ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని ,ఈ సభను విజయవంతం చేయడానికి డి.హెచ్.పి.ఎస్ నాయకులు విరాళాలు సేకరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.హెచ్.పి.ఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, జిల్లా ఉపాధ్యక్షులు మారపల్లి రవి, పిఎన్ఎమ్ రాష్ట్ర సమితి సభ్యులు మామిడి గోపి, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మొగిలి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



## సిఐ శంకర్‌ని పరామర్శించిన మంత్రి సీతక్క

ఉమ్మడి వరంగల్, వాయిస్ టుడే: ములుగు సిఐ వంగపెల్లి శంకర్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు డాక్టర్ దనసరి అనసూయ సీతక్క శుక్రవారం పరామర్శించారు. ములుగు సిఐ గా పనిచేస్తున్న వంగపెల్లి శంకర్ తండ్రి వంగపెల్లి మల్లయ్య ఇటీవలే మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద మంత్రి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ములుగు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, వేలేరు మాజీ ఉప సర్పంచ్, మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.